కష్టానికి బాధ్యతల పట్టం

- జిల్లా నేతలను వరించిన పదవులు
- నలుగురికి నామినేటెడ్ పోస్టులు

కష్టాన్ని అధిష్ఠానం గుర్తించింది. క్షేత్రస్థాయిలో తెదేపా బలోపేతంతో పాటు, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి పనిచేసిన వారికి వీరతాళ్లు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాకు స్థానం కల్పించింది. మొత్తం నలుగురికి పదవులు పట్టం కట్టింది. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ(సత్య) ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా, తెదేపా జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యమైన భాజపా రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్‌ను 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా; జనసేన యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు పాకనాటి గౌతమ్‌రాజును ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌లో సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం, టంగుటూరు, సింగరాయకొండ గ్రామీణం, యర్రగొండపాలెం పట్టణం

వరుస విజయాల కృషీవలుడు...

- **పేరు:** దామచర్ల సత్యనారాయణ(సత్య)
- **పదవి:** ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్
- **స్వగ్రామం:** తూర్పు నాయుడుపాలెం, టంగుటూరు మండలం
- **విద్యార్హత:** బీటెక్, ఎంబీఏ(ఆస్ట్రేలియా)
- **రాజకీయ నేపథ్యం:** దామచర్ల పూర్ణచంద్రరావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు సత్య. తాత దామచర్ల ఆంజనేయులు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక తాత ఆంజనేయులు స్ఫూర్తితో చిన్న వయసులోనే ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు. కొండపి నియోజకవర్గంలో తెదేపా బలోపేతానికి అవిరళ కృషి చేశారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా తెదేపా విజయం సాధించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. జిల్లాలో తెదేపా నిర్వహించిన యువగళం, చంద్రబాబు పర్యటనల విజయవంతానికి శ్రమించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జోన్-1 సమన్వయకర్తగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



దామచర్ల సత్యకు అభినందనలు తెలుపుతున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి

విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు...

- **పేరు:** నూకసాని బాలాజీ
- **వరించిన పదవి:** ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్
- **స్వగ్రామం:** బింగినపల్లి, సింగరాయకొండ మండలం
- **విద్యార్హత:** ఎం.ఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ
- **రాజకీయ నేపథ్యం:** నూకసాని కోటయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడు బాలాజీ. వ్యవసాయ కుటుంబం. ఇంటర్, డిగ్రీ, పీజీ నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారత్ కళాశాలలో పూర్తి చేశారు. విద్యార్థి సంఘం నాయకుడిగా సమస్యల పరిష్కారానికి కృషిచేశారు. తిరుపతి వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పట్టా అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా కొంతకాలం పనిచేసి రాజకీయాలపై మక్కువతో ఉద్యోగాన్ని వదిలి తెదేపాలో చేరారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి పలు బాధ్యతలు నిర్వహించారు. 2011లో వైకాపాలో చేరి ఆ పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో పుల్లలచెరువు నుంచి జడ్పీటీసీగా ఎన్నికై జడ్పీ వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. జడ్పీ అధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. 2015లో తెదేపాలో తిరిగి చేరారు. 2020 నుంచి ఒంగోలు పార్లమెంట్, జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.


నూకసాని బాలాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, నగర మేయర్ సుజాత

బోగస్ ఓట్లపై సంధించిన బాణం..



- **పేరు:** లంకా దినకర్
- **దక్కిన పదవి:** 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్
- **స్వగ్రామం:** ఇస్లాంపేట, ఒంగోలు
- **విద్యార్హత:** సీఏ
- **రాజకీయ నేపథ్యం:** లంకా నేతాజీ సుభాష్ చంద్రబోస్ తెదేపా ఆవిర్భావ సమయంలో జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన ద్వితీయ కుమారుడు దినకర్. ఈయన సీఏగా ఒంగోలులో ఏడేళ్లు ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సామాజిక సేవా దృక్పథంతో 2008లో తెదేపాలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, జాతీయ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019 ఎన్నికల అనంతరం భాజపాలో చేరారు. ప్రస్తుతం భాజపా పొలిటికల్ ఫీడ్‌బ్యాక్ ప్రముఖ్, రాష్ట్ర భాజపా ముఖ్య అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి పార్టీల మీడియా సమావేశాల నిర్వహణ సమన్వయకర్తగా వ్యవహరించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో బోగస్ ఓట్లను తొలగించేలా చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు.

అటు వైద్యం.. ఇటు సేవా కార్యక్రమం



- **పేరు:** పాకనాటి గౌతమ్‌రాజు
- **దక్కిన పదవి:** ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడు
- **స్వగ్రామం:** నరసాయపాలెం, వై.పాలెం మండలం
- **విద్యార్హత:** ఎంబీబీఎస్
- **రాజకీయ నేపథ్యం:** ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో వైద్యుడిగా కొనసాగుతున్నారు. రాజకీయాల మీద మక్కువతో 2014లో జనసేనలో చేరారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున యర్రగొండపాలెం అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటి నుంచి జనసేనలో చురుగ్గా కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. విజయంలో తనవంతు పాత్ర పోషించారు.

జనసైనికుల ప్రాయశ్చిత్త దీక్ష



మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల వేంకన్న లడ్డూలో కల్తీ నెయ్యి ఉదంతానికి నిరసనగా ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మార్కాపురంలో మద్దతు తెలిపారు. ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీక్షా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు గత వైకాపా ప్రభుత్వం నెయ్యి కల్తీ వంటి దుశ్చర్యకు పాల్పడిందని విమర్శించారు. దీక్షలో జనసేన నాయకులు బి.కాశీరామ్‌సింగ్, ఎస్.శ్రీనివాసులు, నరసింహారావు, పి.శ్రీనివాసులు, వెంకట్, రామిరెడ్డి, కేసీ.ప్రసాద్, లక్ష్మీరాజ్యం, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పోటెత్తిన విరాళాలు



రూ.6 లక్షల చెక్కును తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబుకు అందిస్తున్న పుల్లలచెరువు పార్టీ నాయకులు, కార్యకర్తలు



రూ.3.12 లక్షల నగదు అందిస్తున్న వై.పాలెం తెదేపా నాయకులు

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: వరద బాధితులకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తెదేపా నాయకులు పెద్దఎత్తున సేకరించి అందజేస్తున్నారు. ఇసుక త్రిపురవరంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పుల్లలచెరువు తెదేపా నాయకులు సేకరించిన రూ.6 లక్షలను పార్టీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబుకు అందజేశారు.

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెం మండల తెదేపా ముఖ్య నాయకులు, అన్ని గ్రామాల క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు కలిసి సేకరించిన రూ.3.12 లక్షలను తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు, మాజీ సర్పంచి సత్యనారాయణగౌడ్, వెంకట కోటయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: చోడవరం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు గుంటుపల్లి మదన్మోహన్‌రావు రూ.1లక్ష, కొమ్మలపాటి రాఘవరావు రూ.50 వేలు, రావిపాటి నారాయణ రూ.10 వేలు మొత్తం రూ.1.60 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు చెక్కును మంగళవారం ఒంగోలులోని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికైన దామచర్ల సత్యకు అందజేశారు.



తెదేపా నేత దామచర్ల సత్యకు చెక్కు అందజేస్తున్న చోడవరం తెదేపా నాయకులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: వరదలతో తీవ్రంగా నష్టపోయిన విజయవాడవాసులకు పట్టణానికి చెందిన సాధన విద్యాసంస్థలు అండగా నిలిచాయి. ఈ మేరకు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మంగళవారం అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు, సిబ్బంది ఒకరోజు వేతనంతో పాటు విద్యార్థులందించిన ఈ ఆర్థిక సాయాన్ని విద్యాసంస్థల డైరెక్టర్లు జీవీఎల్.రమేష్ బాబు, ప్రిన్సిపల్ కె.మధుసూదన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.కృష్ణారెడ్డి తదితరులు అందజేశారు.



చెక్కును ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అందజేస్తున్న సాధన విద్యాసంస్థల సిబ్బంది

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత చెక్కును మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు.



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు చెక్కు అందజేస్తున్న కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు

22 మంది ఎంపీడీవోలకు బదిలీ


ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 22 మంది ఎంపీడీవోలను బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన అయిదుగురికి పోస్టింగులు కేటాయించారు. ఈ మేరకు జిల్లా ప్రజాపరిషత్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంపీడీవోల బదిలీల వివరాలిలా ఉన్నాయి.

పేరు	పోస్టింగ్ ఇచ్చిన మండలం
పి.సుజాత	పొన్నలూరు
పి.శ్రీవిద్య	కొత్తపట్నం
కె.స్వరూపరాణి	జె.పంగులూరు
కె.రాజశేఖర్‌రావు	ఒంగోలు
ఏ.శ్రీనివాసమూర్తి	చినగంజాం
ఎన్.జగదీష్	మర్రిపూడి
బి.రామాంజనేయులు	కొండపి
వై.శ్రీనివాసరావు	మార్టూరు
కె.నేతాజీ	కారంచేడు
పి.రత్నజ్యోతి	కందుకూరు
డి.నరసయ్య	అర్ధవీడు
ఆర్.దేవసేనకుమారి	టంగుటూరు
డి.జయమణి	సింగరాయకొండ
ఆర్.ఎల్.రాజ్యలక్ష్మి	కొరిశపాడు
వీఎం.రమణమూర్తి	జరుగుమల్లి
కె.కుసుమకుమారి	బల్లికురవ
డి.సురేష్‌బాబు	సంతనూతలపాడు
వి.జ్యోతి	మద్దిపాడు
జి.శ్రీనివాసరావు	ఇంకొల్లు
ఎం.రాజేష్‌బాబు	వేటపాలెం
బి.సింగయ్య	అద్దంకి
ఎం.రంగ సుబ్బరాయుడు	హనుమంతునిపాడు

కంభంలో మత్స్య సిరులు



▶ ఏటా రూ.50 లక్షలకు పైగా ఆదాయం



నీటితో కళకళలాడుతున్న కంభం చెరువు

కంభం, న్యూస్‌టుడే: చారిత్రక కంభం చెరువు మత్స్య సంపదకు నిలయంగా మారింది. ఇది పలు మండలాలకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తోంది. వేలాది ఎకరాల ఆయకట్టుకు నీటిని అందిస్తోంది. పైగా జలాల అవసరాలు తీరుస్తూనే వందలాది మంది మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తోంది. గత కొన్నేళ్లుగా నీరందుబాటులో మత్స్య సంపద గణనీయంగా పెరిగింది. సుమారు 6 వేల ఎకరాల్లో నీరు నిలిచి ఉంటుంది. రుచికరమైన చేపలు కావడంతో వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటోంది. ప్రతి ఏటా పెద్దఎత్తున మత్స్య సంపద ఉత్పత్తి అవుతోంది. దీనివల్ల ఏటా రూ. 50 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. కంభం చెరువు మత్స్యకార సహకార సంఘం పరిధిలో ఉంది. ఈ సంఘంలో 650 మంది సభ్యులున్నారు. వారి పరిధిలో కంభం చెరువుతో పాటు మరో 9 తటాకాలు ఉన్నాయి. వారు ప్రభుత్వానికి సుమారు రూ. 1.13 లక్షల రుసుం చెల్లిస్తున్నారు. వాటిలో పంచాయతీకి 20, నీటి పారుదల, మత్స్య శాఖలు 40 శాతం చొప్పున తీసుకుంటున్నాయి. ఈ చెరువులో మరిన్ని రకాల జలపుష్పాలు వేస్తే మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఈ చెరువులో ఉత్పత్తి అయిన చేపలను ఈ ప్రాంతంలోనే విక్రయించాల్సి ఉన్నా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు జలవనరుల కొత్త నీరు రావడంతో మత్స్యకారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

విద్యుత్తు శాఖ ఈఈ, డీఈలకు స్థాన చలనం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యుత్తు శాఖకు చెందిన పలువురు ఈఈలు, డీఈలు బదిలీ అయ్యారు. మరో 23 మంది డీఈలకు బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ సీఎండీ నుంచి మంగళవారం ఉత్తర్వులొచ్చాయి.

పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ ప్రాంతం
కె.వెంకటేశ్వర్లు	డీపీఈ, ఒంగోలు	టెక్నికల్, ఒంగోలు
టి.హైమావతి	టెక్నికల్, ఒంగోలు	డీపీఈ, ఒంగోలు
ఎం.హరిబాబు	కనిగిరి	ఆపరేషన్, ఒంగోలు
ఏ.వీరయ్య	కందుకూరు	కనిగిరి
ఎం.నాగేశ్వరరావు	ఎంఅండ్‌పీ-1, ఒంగోలు	కందుకూరు
పి.శ్రీనివాసులు	ఈఈ, ఒంగోలు	దర్శి

నిర్వాసితులకు పరిహారం అందిస్తాం

కనిగిరి, న్యూస్‌టుడే: నడికుడి శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణానికి సహకరించాలని, నిర్వాసితులైన వారికి పరిహారం పూర్తి స్థాయిలో అందిస్తామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో శంకవరం, చింతలపాలెం, పేరంగుడిపల్లి సమీపంలో రైల్వే లైన్ నిర్మాణం వల్ల నష్టపోతున్న గ్రానైట్ క్వారీ భూములు, గృహాలను ఆమె పరిశీలించి వారితో మాట్లాడారు. రైల్వే నిర్మాణం వల్ల నష్ట పోతున్న ఏడు గృహాలకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. వీరికి ప్రత్యామ్నాయంగా నివేశన స్థలాలు కూడా ఇప్పిస్తామన్నారు. అందరు సహకరిస్తే కనిగిరికి త్వరలో రైల్వే సౌకర్యం వస్తుందన్నారు.

చంద్రన్న మాట.. చదువుకు బాసట

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వారం గడవక ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలులోకి వచ్చింది. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మద్దిరాలపాడులోని ఓ గృహ సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా తమ పిల్లలను చదివించే స్తోమత లేదని సాయం చేయాలంటూ నిరుపేదలైన ఖాజావలి, బీబీసార సీఎంను కోరారు. స్పందించిన చంద్రబాబు మీ పిల్లల చదువు బాధ్యత తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అక్కడే వేదికపై ఉన్న హర్షిణి కళాశాల అధినేతకు పిల్లల బాధ్యత అప్పగించారు. దానిలో భాగంగా మంగళవారం కుమార్తె పఠాన్ రజియాకు ఇంటర్మీడియట్‌లో, కుమారుడిని మార్టూరులోని శ్రీహర్షిణి స్కూల్లో పదో తరగతి ప్రవేశాలు కల్పించారు. వారిని అధైర్య పడవద్దని పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని కళాశాల అధినేత గోరంట్ల రవికుమార్ భరోసా ఇచ్చారు. ఇద్దరికీ ఆయా వసతి గృహాల్లో ఉచిత వసతి కూడా అందిస్తామన్నారు. పేద దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



పఠాన్ రజియాకు ప్రవేశ పత్రం అందిస్తున్న గోరంట్ల రవికుమార్

100 రోజులు.. రూ.140 కోట్ల పనులు

పొన్నలూరు, న్యూస్‌టుడే: తెదేపా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో జిల్లాకు రూ.140 కోట్లతో పనులు చేపట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మండలంలోని చౌటపాలెంలో మంగళవారం రాత్రి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంలోనే రూ.20 కోట్లు పనులు చేశామన్నారు. నవరత్నాల పేరుతో జగన్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని మండి పడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు ప్రారంభం, రోడ్ల నిర్మాణం మొదలు పెట్టామన్నారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చౌటపాలెంలో సభలో పాల్గొన్న మంత్రి స్వామి, తెదేపా నాయకులు, అధికారులు

చురుగ్గా సాగర్ కాలువ పూడికతీత

▶ చేయూతనందించిన గ్రానైట్ సంస్థ



అగ్రహారం మేజర్‌లో పూడిక తొలగింపు పనులు

న్యూస్‌టుడే, చీమకుర్తి : సాగర్ కాలువల్లో కీలకమైన అగ్రహారం మేజర్‌లో చిల్లచెట్లు, పూడికతీత పనులు గత మూడు రోజులుగా చురుగ్గా జరుగుతున్నాయి. గత వైకాపా హయాంలో నిర్వహణ పనులను విస్మరించారు. ఈ నేపథ్యంలో చీమకుర్తి పరిధిలోని అగ్రహారం మేజర్‌లో పూడిక తీతకు తోడ్పాటు అందజేయాలని స్థానిక రైతులు నీటి పంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య గ్రానైట్ యాజమాన్యానికి విన్నవించగా, వారు యంత్రాలు సమకూర్చి ఈ నెల 21 నుంచి పూడికతీత, చిల్లచెట్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. సుమారు 2.5 కిలోమీటర్ల పరిధిలో పనులు దాదాపుగా పూర్తయ్యాయి. జంగిల్ క్లియరెన్స్ చేసిన ప్రాంతంలో కాలువ కొత్త రూపు సంతరించుకుంది. మేజర్ పొడవునా పూడిక తీయాలంటే సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని.. ఆమేరకు కృష్ణసాయి గ్రానైట్ సంస్థల యజమానులు శిద్దా వెంకటేశ్వర రావు, హనుమంతరావు యంత్రాలు సమకూర్చి పనులు చేయిస్తున్నారని రైతులు కె. రమణయ్య, ఉన్నం హనుమంతరావు, ఈ.నారాయణ, పి. సుబ్బారావు తదితరులు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఇతర గ్రానైట్ సంస్థల వారు యంత్రాలు సమకూరిస్తే సాగర్ కాలువలు కొత్త రూపు సంతరించుకుంటాయని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ జైలుశిక్ష

ఒంగోలు న్యాయవిభాగం , న్యూస్‌టుడే: వ్యాపారి మువ్వల వెంకటసుబ్బారావు అలియాస్ సుబ్బు హత్య కేసులో నిందితుడు గుంటూరు జిల్లా నగరికల్లు మండలం బాలాజీనగర్ తండాకు చెందిన రమావత్ ఏసునాయక్‌కు ఒంగోలు ఒకటో అదనపు జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి, ఫ్యామిలీ, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి డి. అమ్మన్నరాజా యావజ్జీవ జైలుశిక్ష విధించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.హెచ్. జ్యోస్పిన్ తెలిపిన వివరాల ప్రకారం... అద్దంకికి చెందిన సుబ్బారావు భార్యతో వేరుపడి ఒంగోలులోని బాలాజీరావుపేటలో ఉంటున్నారు. ఆయన మంగమూరు రోడ్డులో సుబ్బు సెల్ షాపు పేరుతో దుకాణం ప్రారంభించారు. నిందితుడు ఏసునాయక్ తన స్వగ్రామం నుంచి ఒంగోలు వచ్చి ఇక్కడే నివసిస్తున్నాడు. అతను మహిళలను ఈయన దగ్గరకు తీసుకొస్తూ బాగా దగ్గరయ్యాడు. 2016 డిసెంబర్ 3న నిందితుడు ఒంగోలులోని సుబ్బారావు సెల్‌ఫోన్ దుకాణానికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆదాయం ఎక్కువగా వస్తున్న విషయాన్ని గమనించి.. అదేరోజు రాత్రి అమ్మాయి వద్దకు తీసుకెళతానని చెప్పి జామాయిల్ తోటలోకి తీసుకెళ్లి హత్యచేశాడు. అనంతరం షాపు తాళాలు తెరిచి నగదు, సొత్తు తీసుకుని పరారయ్యాడు. దీనిపై అప్పటి ఒంగోలు రూరల్ సీఐ మురళీకృష్ణ దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారించిన జడ్జి నిందితునిపై నేరం రుజువైనందున యావజ్జీవ జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు. కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

త్రోబాల్ పోటీల్లో సత్తా

దర్శి, న్యూస్‌టుడే: చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇత్తడి ఆనంద్ విజయకుమార్ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 21, 22 వ తేదీలలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

లాక్రోస్ పోటీలకు...

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు సమీపంలోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని షేక్ ఫాతిమా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు జీవీకే. మూర్తి తెలిపారు. ఆమె ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి శ్రీధర్ అభినందించి రూ.10 వేలు బహూకరించారు. కార్యక్రమంలో డీన్ సీవీ.సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

▶ కానరాని మార్కాపురం వైద్య విద్యార్థి ఆచూకీ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. హరిదీప్ స్వగ్రామం మార్కాపురం. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజాము నుంచే సహాయక బృందాలు గాలింపు ప్రారంభించాయి. అయితే రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్దకు ఆదివారం వచ్చిన ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన 14 మంది వైద్య విద్యార్థుల్లో ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర విపత్తుల సహాయక బృందాలు, అటవీశాఖ సిబ్బంది, సీబీఈటీ సభ్యులు అవిశ్రాంతంగా వాగులు, వంకల వెంబడి గాలిస్తూనే ఉన్నారు.

పాములేరు వెంబడి డ్రోన్లతో ...: గాలింపు చర్యలను రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, అటవీశాఖ డీఎఫ్‌వో బబిత పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులుగా జలపాతం పరిసరాలను జల్లెడ పట్టినా ఫలితం లేకపోవడంతో ప్రవాహానికి సదరు విద్యార్థి పాములేరు వాగులోకి కొట్టుకుని పోయి ఉండవచ్చనే అనుమానంతో డ్రోన్లతో వాగు వెంబడి గాలిస్తున్నారు. ఆయా వాగుల వెంబడి ఉన్న కొండల ప్రాంతాలను నిశితంగా పరిశీలించడానికి ఏఎన్ఎస్ పార్టీలను వినియోగించనున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ, తహసీల్దార్ కారం సుబ్బారావులు రాత్రింబవళ్లు అక్కడే ఉండి సహాయక చర్యలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా హరదీప్ ఆచూకీ దొరక్కపోవడంతో అతని తల్లిదండ్రులతో పాటు, స్నేహితులు, బంధువులు ఇక్కడే ఉండిపోయారు. గాలింపు జరుగుతున్న ప్రదేశాల్లో వారు ఉండి, ఆచూకీ దొరకకపోతుందా అనే ఆశతో ఎదురుచూస్తూనే.. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం ఉదయం గాలింపు ప్రదేశానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. ఇలా గల్లంతు కావడం చాలా విచారకరమని, ఈ ప్రదేశంలో ఎప్పుడూ ఇటువంటి ప్రమాదం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఆమె ధైర్యం చెప్పారు. అలాగే పర్యటక ప్రదేశాల్లో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నాలుగు గ్రానైట్ వాహనాల సీజ్

మద్దిపాడు, న్యూస్‌టుడే: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న నాలుగు లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ రాఘవరావు మంగళవారం సిబ్బందితో మండలంలో పలు రహదారులలో నిఘా వేశారు. వెల్లంపల్లి - తాళ్లూరు రహదారిలో అక్రమంగా గ్రానైట్ ముడిరాయిని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం గురవారెడ్డిపాలెం కొష్టాలు మార్గంమధ్యలో గ్రానైట్ స్లాబులతో వెళుతున్న రెండు లారీలను ఆపి తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు చూపించలేదు. దీంతో అక్రమంగా తరలిస్తున్న ఆ వాహనాలను మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన గ్రానైట్ లారీలు

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

విధి వంచితపై మృగాడి అఘాయిత్యం

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విధి వంచితురాలపై ఓ మృగాడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సభ్య సమాజం తలదించుకునే ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదిలి ఎస్సై వేమన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ మతిస్థిమితం కోల్పోయింది. గత గురువారం ఆమె పొలం నుంచి ఇంటికొస్తుండగా బట్టువారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల రహేలయ్య నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కుంగిపోయిన బాధితురాలు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా, ఆమెకు స్థానికంగా ప్రథమ చికిత్సలు చేసి, పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు పొదిలి పోలీసులకు సమాచారమివ్వగా, సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు.

ఈనాడు సినిమా

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.


కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".


ఐశ్వర్యరాయ్
అలియా భట్

ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు

మరిన్ని విశేషాలు www.eenadu.net లో


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".


శ్రీహర్ష, కషిక కపూర్

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.

మాజీ.. మంతనాల్లో లేదు రాజీ

◗ నేతలతో ఎడతెగని సమావేశాలు ◗ మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు



ఒంగోలు, న్యూస్‌టుడే:

వైకాపాను వీడి జనసేన వాకిట నిలిచిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి తన రాజకీయ జీవితంలోనే గతంలో ఎన్నడూ లేనంత సంకట స్థితిని ఎదుర్కొంటున్నారు. వైకాపాలో తనతో కలిసి ప్రయాణం చేసిన నాయకులు, కార్యకర్తలను వెంట తీసుకెళ్లే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ఆ పార్టీ నేతలు, కార్యకర్తలతో గత మూడు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కీలక తరుణంలో తనతో కలిసి రావాలని కోరుతున్నారు. ఈ క్రమంలో శ్రేణుల నుంచి ఆయనకు మిశ్రమ స్పందన లభిస్తోంది.

◗ **జాప్యంతో తప్పని నష్టం...:** గత ఎన్నికలకు ముందే వైకాపాలో కొనసాగడంపై బాలినేని తీవ్ర ఊగిసలాట ధోరణి ప్రదర్శించారు. కుటుంబీకులతో చర్చించారు. అక్కడ ఏకాభిప్రాయం రాకపోవడం, వైకాపాలోనే కొనసాగాలనే ఒత్తిళ్ల మధ్య ఎన్నికల బరిలోకి దిగారు. తన రాజకీయ ప్రత్యర్థి దామచర్ల జనార్దన్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల తర్వాత హైదరాబాద్ వెళ్లి అక్కడే ఉండిపోయారు. ఆ సమయంలో భవిష్యత్తు కార్యాచరణపై ఆయన్ను సంప్రదించినా ఏమీ తేల్చలేదు. సుమారు నెల రోజుల క్రితం ఒంగోలు వచ్చినా తన భవితవ్యంపై పెదవి విప్పలేదు. వెళ్లే వారిని ఆపలేనంటూ బేలగా మాట్లాడేశారు. దీంతో ఒంగోలులో సగం మంది కార్పొరేటర్లు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వెంట నడుస్తున్నారు. ఆ తర్వాత బాలినేని జనసేన బాట పట్టారు.

◗ **మీ వెంట మేం నడవలేం..!:** మూడు రోజుల క్రితం బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు వచ్చారు వైకాపా నాయకులు, కార్యకర్తలతో ఎడతెగని సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వైకాపాలోనే కొనసాగుతున్న ఇరవై మంది కార్పొరేటర్లలో కొందరు మాత్రమే ఆయన వద్దకు వస్తున్నారు. ఏడుగురు తాము వైకాపాను వీడలేమని స్పష్టం చేసినట్లు తెలిసింది. వైకాపా ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్ కూడా దూరంగా ఉంటున్నారు. చెప్పకుండా నిర్ణయాలు తీసేసుకుని.. ఇప్పుడు కలిసి నడవమంటే ఎలా అని ఆయన బాలినేనిని ప్రశ్నించినట్లు సమాచారం.

◗ **స్పందించని 'స్థానిక' గణం...:** జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా బాలినేనికి ఆశించిన మద్దతు రావడం లేదనే ప్రచారం సాగుతోంది. మూడు దశాబ్దాలకు పైగా తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో అన్ని నియోజకవర్గాల్లో ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారితో తనకున్న వ్యక్తిగత సాన్నిహిత్యం రీత్యా అత్యధికులు కలిసి నడుస్తారని బాలినేని భావించారు. తీరా పార్టీకి రాజీనామా చేసిన తర్వాత అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. స్థానిక సంస్థలకు చెందిన పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు తనతో కలిసి వస్తారనుకున్నారు. గత రెండు రోజులుగా కొందరు నాయకులతో మంతనాలు సాగిస్తున్నా.. వారి నుంచి మిశ్రమ స్పందన లభిస్తోందని తెలిసింది.

భూమి లేకపోతేనేం.. రిజిస్ట్రేషన్ చేస్తాం!


◗ వెలుగు చూసిన అక్రమ వ్యవహారం ◗ వై.పాలెం కార్యాలయంలో మాయాజాలం

సాధారణంగా ఆస్తుల క్రయవిక్రయాలకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులు ఆధారాలు చూసి ప్రక్రియ పూర్తిచేస్తారు. ఏవైనా చిన్నపాటి లోపాలున్నా రిజిస్ట్రేషన్ నిలిపేస్తారు. ఇవన్నీ సామాన్యులకేనని యర్రగొండపాలెం సబ్-రిజిస్ట్రేషన్ అధికారులు నిరూపించారు. అసలు భూమే లేకుండా రిజిస్ట్రేషన్లు చేసి భారీగా దండుకున్న వ్యవహారం తాజాగా వెలుగు చూసింది. – న్యూస్‌టుడే, యర్రగొండపాలెం



◗ **డబ్బులతో చుక్కలు చెరిపేశారు...:** వై.పాలెం పట్టణంలోని సర్వే నం.557లో 7.83 ఎకరాల భూమి ఉంది. రెండు సబ్-డివిజన్లు చేసి 557-1లో 7.11 ఎకరాలు ప్రైవేట్, 557-2లో 66 సెంట్లు ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. మొదటి సబ్ డివిజన్‌లోని భూమి ఇప్పటికే నివాస స్థలాలుగా మారింది. పక్కనే సర్వే నం.61లోని ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసిన కొందరు వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించారు. ఈ సర్వే నంబరు 'చుక్కల భూమి'గా ఉండడంతో 2016 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. ఈ భూమిలో ప్లాట్లు వేసి విక్రయించిన యజమానులు ఇక్కడే కుతంత్రానికి తెర లేపారు. వై.పాలెం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 2021లో సంప్రదించారు. ఇదే అదనుగా కార్యాలయ సిబ్బంది, అధికారులు కొందరు ముడుపులు తీసుకుని చక్రం తిప్పారు. రికార్డుల్లో లేని సర్వే నంబరుతో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేశారు.

◗ **రూ.లక్షల్లో బేరసారాలు...:** ప్లాట్లు వేసిన నంబరు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పక్కనే ఉన్న 557 సర్వే నంబరు వేసి రిజిస్ట్రేషన్ చేసేలా కార్యాలయంలోని దళారులు రూ.లక్షలకు బేరం కుదిర్చారు. భారీ మొత్తంలో నగదు అందడంతో నిబంధనలను పక్కన పెట్టిన అధికారులు అక్రమానికి తెర లేపారు. సర్వే నంబరు 61లోని ఇద్దరు భూమి హక్కుదారులకు సర్వే నంబరు 557-3లోనూ భూమి ఉన్నట్లుగా చూపించారు. భూ యజమానుల అసలు భూమి తాలూకా ఖాతా నంబరు వేసి 20-7-2021 తేదీన డాక్యుమెంట్ నం. 2811/2021తో 40 సెంట్ల భూమిని గజాల కింద మార్చి జీపీఏ చేశారు. ఆ తర్వాత అది పలువురి చేతులు మారి సేల్ డీడ్‌గానూ రిజిస్ట్రేషన్లు చేశారు. వాస్తవానికి 557-3 సర్వే నంబరు రెవెన్యూ రికార్డుల్లోనే లేదు. ఆర్ఎస్ఆర్ దాఖలా ఈ సర్వే నంబరు విస్తీర్ణం 7.83 ఎకరాలు మాత్రమే. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం అంతకుమించి సొంతంగా సర్వే నంబరు తయారు చేసి రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం.


సర్వే నం.557-3లో వ్యవసాయ భూమిగా చూపిస్తూనే పూర్తి విస్తీర్ణం నమోదు చేయకుండా గజాల కింద మార్చి రిజిస్ట్రేషన్(జీపీఏ అనంతరం విక్రయించారు) చేసినట్లు ఉన్న ఈసీ

ప్చ్.. పూర్తి విస్తీర్ణమూ చూపలేదు...

సాధారణంగా ఏదైనా వ్యవసాయ భూమిని రిజిస్టర్ చేయాలంటే వెబ్‌ల్యాండ్ కీలకం. తహసీల్దార్ డిజిటల్ సంతకంతో జారీ చేసే 1బీ, అడంగల్ రికార్డును పరిగణనలోకి తీసుకుంటారు. అందులో ఏవైనా దోషాలున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపేస్తారు. ఈ వ్యవహారంలో అవేమీ లేవు. కేవలం విక్రయదారుల ఖాతా సంఖ్య మాత్రమే దస్త్రంలో నమోదు చేశారు. సర్వే నంబరు పూర్తి విస్తీర్ణం, అందులో విక్రయదారుకు ఉన్న విస్తీర్ణం ఎంతనేది నమోదు చేయలేదు. 'సర్వే నం.557/3 పుంజ పైకి డోర్ నం.11-250కి సమీపంలో' అని పేర్కొంటూ గజాల కింద జీపీఏ చేశారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ టి.హేమలత మాట్లాడుతూ.. డాక్యుమెంట్ రైటర్లు తయారు చేసిన దస్తావేజును కంప్యూటర్ ఆపరేటర్లు పరిశీలించి ఇస్తే రిజిస్టర్ చేసినట్లు చెప్పారు. తాను కేవలం సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందో లేదో మాత్రమే చూశానన్నారు. వెబ్‌ల్యాండ్ సరిగా పని చేయకపోవడంతో అడంగల్ చూడలేదని.. డాక్యుమెంట్‌కు అడంగల్ జత చేశారా లేదా అనేది తనకు తెలియదన్నారు. సర్వే నంబరు తప్పు పడిందని సదరు క్రయ, విక్రయదారులు సవరణ కోసం సంప్రదించినట్లు తెలిపారు. అసలు నంబరు చుక్కల భూమి కింద ఉండడంతో కుదరదని చెప్పానని.. రిజిస్ట్రేషన్ సమయంలో అసలు ఆ సర్వే నంబరులో భూమి ఉందో లేదో అనేది తనకు తెలియదనడం గమనార్హం.


సూచనలు చేస్తున్న ఎస్పీ దామోదర్.. చిత్రంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏవో సులోచన

మహిళా పోలీసులకు బదిలీలు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని వార్డు/గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్‌ను ఒంగోలులోని పోలీసు కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలను అనుసరించి దివ్యాంగులు, పరస్పర అంగీకారం, దంపతులు, వైద్యపరమైన ఇబ్బందులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని బదిలీలు చేపట్టారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో తెరపై ప్రదర్శిస్తూ.. స్వస్థలాలు మినహా ఇతర ప్రాంతాలకు బదిలీలు చేపట్టారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంపై మహిళా పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. తొలుత ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ.. నేర నియంత్రణ, మహిళలు, చిన్నారుల రక్షణపై మహిళా పోలీసులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీపీవో ఏవో సులోచన, ఏఏవో ఉస్మాన్ బాషా, పర్యవేక్షకురాలు డి.శైలజ, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◗ **కవాతు మైదానం పరిశీలన...:** జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని కవాతు మైదానాన్ని ఎస్పీ దామోదర్ మంగళవారం పరిశీలించారు. కవాతు, క్రీడలు, వేడుకల నిర్వహణకు వీలుగా మైదానాన్ని తీర్చిదిద్దాలని, మరిన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

గుప్తాపై దాడి కేసు.. హత్యాయత్నంగా మార్పు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలుకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు సోమిశెట్టి సుబ్బారావు గుప్తాపై చోటుచేసుకున్న దాడి కేసును.. హత్యాయత్నంగా మార్పు చేస్తూ పోలీసులు తాజాగా నమోదు చేశారు. అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా 2021 డిసెంబర్ 12న సుబ్బారావు గుప్తా చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. సదరు సభలో వైకాపాలో కొందరు నాయకుల తీరు, పార్టీకి వాటిల్లుతున్న నష్టంపై పలు సూచనలు చేశారు. దీనిపై బాలినేనికి సన్నిహితంగా ఉండే కొందరు ఆగ్రహించారు. అదే నెల 18న గుప్తా ఇంటిపై దాడి చేశారు. దీంతో గుప్తా ప్రాణభయంతో పారిపోయి గుంటూరులోని ఓ లాడ్జిలో దాక్కున్నారు. అయినా ఆయన్ను వదలేదు. సాంకేతిక పరిజ్ఞాన సాయంతో వెతికి పట్టుకున్నారు. అనంతరం సుభానీ, సైదాతో పాటు మరికొందరు లాడ్జిలో గుప్తాపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. అతన్ని మోకాళ్లపై కూర్చోబెట్టి బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పించారు. ఈ విషయంపై గుప్తా అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా తేలిగ్గా తీసుకున్నారు. తాజాగా ఈ కేసుపై సీరియస్‌గా దృష్టి సారించారు. దాడిని హత్యాయత్నం కేసుగా మార్చారు. కుట్రధారులు, సూత్రధారులు, పాత్రధారులపై దృష్టిసారించారు.

కలిసొచ్చే కాలం.. సాగు ఆశాజనకం

◗ 2.75 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు

ఈనాడు, ఒంగోలు:

అన్నదాతకు ఈ ఏడాది కాలం కలిసొచ్చింది. వాతావరణం అనుకూలించింది. దీంతో జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు ఆశాజనకంగా సాగుతోంది. గతేడాది కర్షకులకు గడ్డుకాలమే మిగిలింది. ఈ ఏడాది జూన్, జులై తొలి రెండు నెలల్లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో కాడి పడేయాల్సి వస్తుందేమోనని హలధారులు ఆందోళన చెందారు. ఆగస్టు చివరిలో వరుణుడు కరుణించడంతో వారిలో ఆశలు చిగురించాయి. అప్పటికే దుక్కులు దున్నుకుని ఉన్న పొలాల్లో సాగుకు ఉపక్రమించారు. ఆగస్టు చివరి వరకు ఖరీఫ్ సీజన్ తొలి మూడు నెలల్లో 1.60 లక్షల ఎకరాలు సాగవ్వగా., ఆ తర్వాత పదిహేను రోజుల్లోనే మరో 1.15 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. మొత్తంగా జిల్లాలో ఇప్పటి వరకు 2.75 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులో ఉండటంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పంట రకం	గతేడాది	ప్రస్తుతం (హెక్టార్లలో)
మొక్కజొన్న	1,955	2,689
కొర్రలు	335	2,243
నువ్వులు	785	3,384

(వరి 2 వేలు, కంది 24 వేలు హెక్టార్లు గతేడాదికంటే ఎక్కువ విస్తీర్ణంలో ఈ ఏడాది సాగు చేశారు. పత్తి మాత్రం గతేడాది కంటే 4 వేల హెక్టార్లు తక్కువ సాగైంది.)



◗ **ఏ పంటలు.. ఎక్కడెక్కడంటే...:** వరి(ముండ్లమూరు, దర్శి, తాళ్లూరు, చీమకుర్తి, త్రిపురాంతకం, కంభం తదితర మండలాలు).
● **పత్తి, మిర్చి, పొగాకు**(గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, పొదిలి తదితర ప్రాంతాలు). ● **పొగాకు, మిర్చి:** కొండపి, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలు.

జిల్లాలో సాగు వివరాలు ఇలా(ఎకరాల్లో)...
- ఖరీఫ్ సాధారణ సాగు: 4.99 లక్షలు
- గత ఏడాది సెప్టెంబరు 16 వరకు: 1.05 లక్షలు
- ఈ ఏడాది ఇప్పటి వరకు చేసింది: 2.75 లక్షలు
- గతేడాదితో పోలిస్తే అదనం: 1.70 లక్షలు

బేస్తవారపేట, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని చిన్న ఓబినేనిపల్లెలో స్థానిక ఎస్సీ పాలెం నుంచి చెరువు కట్టకు వెళ్లే రహదారికిరువైపులా చిల్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చిల్లచెట్లను తొలగించగలరు.
– ఎస్సీపాలెం వాసులు, చిన్న ఓబినేనిపల్లె.

సమాధానం: సర్పంచితో మాట్లాడి చిల్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– డి.జమాల్, పంచాయతీ కార్యదర్శి

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే:

సమస్య: రాచర్ల మండలం అక్కపల్లిలో కోతుల బెడద అధికంగా ఉంది. అవి మహిళలు, చిన్నారులను భయపెడుతున్నాయి.
– వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి కోతుల సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో, రాచర్ల

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

నులి పురుగుల నివారణపై అవగాహన

కంభం, న్యూస్‌టుడే: నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని సీహెచ్‌వో హబీబ్‌ఖాన్ అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భోజనానికి ముందు అందరూ చేతులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిబాబారెడ్డి, అధ్యాపకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి గ్రామీణ నీటిసరఫరా విభాగం డీఈగా జె లక్ష్మణ్‌నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉదయగిరి నుంచి బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన డీఈ వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది. అప్పటి నుంచి కనిగిరి డీఈ విశ్వనాథ రెడ్డి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంతో దిగుబడులు



మార్కాపురం: నాయుడుపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, కంభం, పెద్దదోర్నాల, త్రిపురాంతకం గ్రామీణం, బేస్తవారపేట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు రసాయనిక ఎరువులు అధిక సంఖ్యలో వినియోగిస్తుండడంతో పెట్టుబడులు పెరిగి నష్టపోతున్నారని.. అధిక దిగుబడిని పెంపుదలకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. మార్కాపురం మండలం నాయుడుపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చెందిన రైతు తిరుమలరెడ్డి సాగు చేస్తున్న కంది పంటను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అన్నదాతలు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. గ్రామ స్థాయి వ్యవసాయ సహాయకులు రైతులు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి రమేష్, తెదేపా మండల అధ్యక్షుడు రామాంజులురెడ్డి, నాయకులు ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు. ● కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలోని ఆర్బీకే వద్ద ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన ఉద్యాన, బిందు, వ్యవసాయ, సేంద్రియ సాగుకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించారు. ● పెద్దదోర్నాలలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో జవహర్‌లాల్‌నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కరపత్రాలు ఆవిష్కరించారు. ● త్రిపురాంతకం మండలంలోని మేడపి, ఎండూరివారిపాలెం గ్రామాల్లో తెదేపా నాయకులు, అధికారులు మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ● బేస్తవారపేటలోని స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పొలం పిలుస్తోంది గోడ పత్రికలను జడ్పీటీసీ సభ్యుడు వెంకటరాజు, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

నాటి నిర్లక్ష్యం.. చెరువులకు శాపం..



అభివృద్ధికి నోచుకోని మార్కాపురంలోని పెద్దచెరువు

మార్కాపురం, న్యూస్‌టుడే:

ఒకప్పుడు మండలంలోని చెరువులు నిండుకుండలా ఉండి కళకళలాడేవి. వాటిల్లో నీరు ఉన్నప్పుడు ఆయకట్టు కింద ఉన్న పొలాలు భూమికి పచ్చని రంగేసినట్లు ఆహ్లాదం పంచేవి. కానీ గత వైకాపా ప్రభుత్వం చెరువులపై చిన్నచూపు చూసింది. అయిదేళ్ల పాలనలో వాటికి కనీసం మరమ్మతులు సైతం చేపట్టలేదు. ఫలితంగా అవి ఒట్టిపోయి, ముళ్లచెట్లు పెరిగిపోయి, అక్రమ మట్టి తరలింపు కేంద్రాలుగా తయారయ్యాయి. దాని పరిధిలోని పొలాలన్నీ నీరు అందక బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

అయిదేళ్లు పట్టించుకోలేదు.. మార్కాపురం మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో మొత్తం 27 చెరువులు ఉన్నాయి. వీటిల్లో మార్కాపురం పట్టణంలో నడిబొడ్డున ఉన్న చెరువు, మండలంలోని వేములకోట, తిప్పాయపాలెం, పెద్దనాగులవరం, భూపతిపల్లె, పెద్దయాచవరం గ్రామాల్లోని చెరువులు కీలకమైనవి. తెదేపా ప్రభుత్వ హయాంలో 2014- 2019 మధ్య కాలంలో నీరు- చెట్టు పేరుతో చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు వాటి నిర్వహణ గాలికొదిలేసింది. పూడిక తీత పనులు చేపట్టలేదు. నీరు పారే కాలువల మరమ్మతులు, తూములు బాగు చేయడంపై కనీసం దృష్టి సారించలేదు. ఫలితంగా కాలువలన్నీ చిల్లచెట్లు, గుర్రపుడెక్కలతో నిండిపోయాయి. వర్షాలు కురిసినా నీరు పారక చెరువు నిండడం లేదు. చెరువులన్నీ ఒట్టిపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతూ కోట్ల రూపాయాల జేబులో నింపుకొన్నారు. మార్కాపురం పట్టణంలోని చెరువు సర్వే నెంబరు 549లో 584 ఎకరాలు ఉంది. దీని పరిసరాలు సుమారు 60 ఎకరాల వరకు ఆక్రమణ గురైనట్లు సమాచారం. వేములకోట చెరువు కింద ఆయకట్టు 775 ఎకరాలు, తిప్పాయపాలెం చెరువు పరిధిలో 1,192 ఎకరాలు, పెద్దయాచవరం చెరువు కింద 104 ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఒక్క ఎకరా కూడా ప్రస్తుతం సాగులో లేదు. వేములకోట చెరువులో నిత్యం అక్రమ మట్టి తవ్వకాలకు నిలయంగా మారిపోయింది.

నిర్వహణ గాలికొదిలేసిన గత పాలకులు



చిల్లచెట్లతో నిండిపోయిన వేములకోట చెరువు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

తర్లుపాడు మండలంలో మొత్తం 26 చెరువులు ఉన్నాయి. ఈ మండలంలో కీలకమైన చెరువులైన ఎం.గొల్లపల్లి చెరువు కింద ఆయకట్టు 583 ఎకరాలు, పోతలపాడు చెరువులో పరిధిలో 113 ఎకరాలు, గంఢ్లోపల్లి చెరువు కింద 130 ఎకరాలు, తుమ్మలచెరువు పరిధిలో 280 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏళ్లుగా చెరువు కింద రైతులు ఒక్క పంటను కూడా పూర్తి స్థాయిలో పండించలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి చెరువులను మరమ్మతులకు చేయించి వాటిల్లోకి నీరు వచ్చేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి



కంభం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం, మార్కాపురం, పొదిలి, పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని తురిమెళ్లలో సర్పంచి మాధవ సుభద్ర అధ్యక్షతన మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లడానికి కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రజలను వేధించడానికే సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పాలన కాలం సరిపోయిందని ఎద్దేవా చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో ట్రాక్టర్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నారిశెట్టి వీరమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, తెదేపా నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల చేత మంచి ప్రభుత్వం అనిపించుకుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. మార్కాపురం మండలంలోని పెదనాగులవరంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ● పొదిలి మండల కేంద్రంతో పాటు, మండలంలోని కంభాలపాడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కంభాలపాడులో నిర్వహించిన ప్రదర్శనలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద పాల్గొన్నారు. పుల్లలచెరువు మండలంలోని ఇసుక త్రిపురవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో యర్రగొండపాలెం తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.

కోవిడ్ వారియర్ గౌస్‌కు సన్మానం

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: కరోనా సమయంలో మానవత్వం ప్రదర్శించి వందల మందికి అంత్యక్రియలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన తిరుపతికి చెందిన జేఎండీ.గౌస్‌ను పట్టణంలోని క్రెస్ట్‌క్లబ్‌లో సోమవారం రాత్రి జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ మహమ్మారితో ఎంతో మంది చనిపోయారని.. అటువంటి పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు వచ్చి గౌస్ మానవత్వాన్ని చాటుకున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ నాయకులు సికిందర్, మహమ్మద్‌ఖాన్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



గౌస్‌ను సన్మానిస్తున్న జమాతే ఇస్లామీ హింద్ నాయకులు

జూదరుల అరెస్టు

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: మండలంలోని యడవల్లి చెప్పుల పరిశ్రమ సమీపంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 42,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

వైద్య కళాశాల పనుల పూర్తికి వినతి

మార్కాపురం పట్టణం: మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద నిర్మిస్తున్న వైద్య కళాశాల ఆసుపత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నియోజకవర్గ భాజపా అసెంబ్లీ కన్వీనర్ పీవీ.కృష్ణారావు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. విజయవాడలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బిల్లులు మంజూరు చేయాలని విన్నపం

ఈనాడు డిజిటల్, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఆచంట సునీత, ఉండవల్లి శ్రీదేవి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా వాసి వినతిపత్రం అందజేశారు. 2018లో సీసీ రోడ్లు వేశానని, రూ.10లక్షలు పెట్టినా ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదని ప్రకాశం జిల్లా పెద్దారవీడుకు చెందిన కాంట్రాక్టర్ తిరుపతయ్య వినతిపత్రం అందించారు.

నల్లమల దారిలో లారీ బోల్తా

గాజులపల్లె (మహానంది): నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఇటుకల వంతెనను మంగళవారం తెల్లవారుజామున ఉల్లిగడ్డల లోడుతో వెళుతున్న ఓ లారీ ఢీకొని బోల్తాపడింది. భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కార్లు, ఆటోలు, జీపులు మాత్రం వెళ్లేందుకు దారి ఉండటంతో లారీలు, బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారి భద్రతా విభాగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని తొలగించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. మధ్యాహ్నమైనా సమస్య పరిష్కారం కాలేదు. ఆకలితో ఇబ్బంది పడుతున్న డ్రైవర్లు, క్లీనర్లకు గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి అన్న క్యాంటీన్ నుంచి భోజనాలు పంపించారు. రాత్రి పదిగంటల వరకు లారీని తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

వరద బాధితులకు రూ.70 వేల విరాళం



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న మాజీ సైనికులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మాజీ సైనికులు వరద బాధితుల కోసం రూ. 70వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి అందజేశారు. మాజీ సైనికులు సామాజిక సేవలో పాలు పంచుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీ.సీ.అంకన్న, సభ్యులు ఎం.కోటిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి

మార్కాపురం, యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని.. మార్కాపురం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజరు రఘురాం పేర్కొన్నారు. మార్కాపురంలోని తర్లుపాడు రహదారిలోని సుబ్బరామిరెడ్డి పార్కులో మంగళవారం ఏపీజీబీ ప్రాంతీయ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కు ఆవరణలోని చెత్తాచెదారంను తొలగించారు. పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రీజనల్ బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ.. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు పార్కులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు, సహాయ మేనేజర్లు, గజ్జలకొండ, తిప్పాయపాలెం, ఉద్యోగులు పాల్గొన్నారు. ● యర్రగొండపాలెం టోల్‌ప్లాజా పరిసర ప్రాంతంలో టోల్‌ప్లాజా సిబ్బంది, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఆవరణలో మొక్కలు నాటారు.

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో సుభద్ర

పొదిలి, న్యూస్‌టుడే: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో డి.సుభద్ర తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. గుడ్లు కొంతమంది పిల్లలు తినకపోవడాన్ని గమనించారు. పాఠశాల రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి పలు సూచనలిచ్చారు. ఆమె వెంట కనిగిరి, ఒంగోలు డివిజన్ల ఉప విద్యాశాఖాధికారులు చంద్రమౌళీశ్వర్, ఎస్.సుబ్బారావు, ఎంఈవో ఎం.శ్రీనివాసులు, సీఆర్పీలు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల పరిశీలన



వై.పాలెం: సిబ్బందితో మాట్లాడుతున్న ఉప కలెక్టర్ త్రివినాగ్

యర్రగొండపాలెం పట్టణం, పెద్ద దోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ వందపడకల వైద్యశాలను మంగళవారం మార్కాపురం ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్ తనిఖీ చేశారు. రోగుల గదులు, వైద్య పరికరాలు, పిల్లల వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాల ఇన్‌ఛార్జి డాక్టర్ యదిద్యా వైద్యశాల్లోని సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో సబ్ కలెక్టర్ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాన్నారు. అనంతరం పెద్ద దోర్నాలలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... గతంలో వైద్యశాల్లోకి వెళ్లేందుకు ఉన్న గేట్ల ముందు స్థలం ఆక్రమణకు గురైనట్లు పరిశీలనలో తేలిందన్నారు. సంబంధిత నివేదిక ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక



పి.లక్ష్య



ఏ.నాగభార్గవి

మార్కాపురం పట్టణం, త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీబాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, పీడీ డి.శ్యామలాదేవిలు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు పి.లక్ష్య, ఏ.నాగభార్గవిలు సింగరాయకొండలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు వివరించారు. ● ఈ నెల 27న జిల్లా స్థాయిలో నిర్వహించనున్న క్రీడల పోటీలకు త్రిపురాంతకం మండలంలోని గణపవరం జడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.ఏడుకొండలు, పీడీ బాలరాజులుతెలిపారు.

● **బేస్తవారపేట:** జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు పలువురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సిద్ధేశ్వరశర్మ తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



పరుగుపందెం పోటీల్లో బాలికలు

మార్కాపురం పట్టణం: మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని పెంచుకొని రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన అభినందించారు. అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బి.రాందాస్‌నాయక్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓ.వీరారెడ్డి, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

విద్యార్థి దశ నుంచే సేవా భావం అవసరం

కొమరోలు గ్రామీణం: జాతీయ సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవరుచుకోవాలని తెలిపారు. అధికారి రవినాయక్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ సేవలు మరువలేనివి

కంభం: విద్యుత్తు శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వి.ఆర్.వి.నారాయణ సేవలు మరువలేనివని ఆ శాఖ ఏఈ వెంకట నరసయ్య అన్నారు. బదిలీపై పెద్దరవీడు వెళ్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్‌ను మంగళవారం స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయం వద్ద సత్కరించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు.

వైద్యులు ఉండరు.. సేవలు అందవు

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే:

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులకు సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. నియోజకవర్గంలో వైద్యుల కొరతతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. కొమరోలు మండలంలోని కొమరోలు, గిద్దలూరు మండలంలోని కృష్ణం శెట్టి పల్లె, బేస్తవారిపేట మండలంలోని సోమవారిపేట, అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె గ్రామాల్లో పశు వైద్య శాలల్లో వైద్యుల కొరత వేధిస్తుంది. మూడేళ్ల క్రితం నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఇక్కడి వైద్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లగా వారి స్థానాలు ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. దీంతో ఆయా పశు వైద్యశాలల్లో స్థానిక కాంపౌడర్లు, సచివాలయ పశు సహాయకులు, గోపాల మిత్రలే వైద్యం అందిస్తున్నారు.

● **సహాయకులతోనే సరి..**

అందుబాటులో ఉన్న సహాయకులు సాధారణ వ్యాధులకు మాత్రమే వైద్యం చేయగలుగుతున్నారు. తీవ్ర పరిస్థితుల్లో వారికి ఏం చేయాలో తెలియడంలేదు. దీంతో వ్యాధులు ముదిరి పశువులు చనిపోతుండటంతో పశుపోషకులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కొమరోలు వైద్యశాలల్లోని గత రెండేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో వైద్యులు వెళ్లిపోవడంతో అప్పటి నుంచి ఇన్‌ఛార్జ్ వైద్యులతో నెట్టుకొస్తున్నారు. వైద్యశాలలు పేరుకు మాత్రమే కనిపిస్తున్నాయి అందులో వైద్య సేవలు మాత్రం నిలిచిపోయాయి. ఇటీవల రెండు వైద్యశాలలకు కాంపౌండర్‌లను నియమించిన మమ అనిపించారు. వైద్యం కోసం వచ్చిన పశువులను అక్కడి సహాయకులతో వైద్యం చేయించి పంపిస్తున్నారు. దీంతో చేసేదేం లేక సచివాలయ సహాయకులు, గోపాలమిత్రలపై ఆధారపడాల్సి వస్తోందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగుంట్ల సచివాలయ పశు సహాయకురాలు గత మూడు నెలలు నుంచి సెలవులపై వెళ్లగా గ్రామంలో పశు పోషకులు సమీపంలోని ఇడమకల్లు సహాయకుడిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ విషయమై గిద్దలూరు ఇన్‌ఛార్జి పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బాలునాయక్ మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న కొమరోలు, సోమవారిపేట, కృష్ణం శెట్టి పల్లె, పాపినేనిపల్లె పశువైద్యశాలకు వారానికి మూడు రోజులు పాటు సమీపంలోని పశువైద్యులను ఇన్‌ఛార్జిలుగా నియమించినట్లు తెలిపారు.



కొమరోలు పశువైద్యశాల



ఖాళీగా ఉన్న వైద్యుడి సీటు ముందు విధుల్లో ఉన్న కాంపౌండర్

కనిగిరి

•కనిగిరి • దర్శి • కొండపి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని దాసరిపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లి రహదారి ఛిద్రమై చిల్లచెట్లతో మూసుకుపోతుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. -ఆర్.వెంకటేశ్వర్లు, గ్రామస్థులు

సమాధానం: పంచాయతీ నిధులు వెచ్చించి రోడ్డు పక్కనున్న చిల్లచెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -షరీఫ్, ఈవోఆర్డీ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే:

సమస్య: సి.ఎస్.పురంలోని పంచాయతీరాజ్ అతిథి గృహానికి సమీప కాలనీలో కుళాయిలకు సరఫరా అవుతున్న తాగునీరు దుర్వాసన వస్తోంది. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఈ నీరు వస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి. -తాటి కనకేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: గ్రామంలోని తాగునీటి ట్యాంకులను తరచూ క్లోరినేషన్ చేయిస్తున్నాం. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును మరోసారి శుభ్రం చేయిస్తాం. ఎక్కడైనా పైపులు లీకవుతున్నాయేమో పరిశీలిస్తాం. -వై.రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈఈ

జరుగుమల్లి, న్యూస్‌టుడే:

సమస్య: జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో రెండు నెలల క్రితం విద్యుత్తు వైర్లకు మరమ్మతులు చేయడంతో... దీంతో కరెంటు సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. -రామ్మోహనరావు, గ్రామస్థులు

సమాధానం: ఇటీవల పిడుగుపాటుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయించాం. గ్రామంలో పర్యటించి సమస్యను గుర్తించి పరిష్కరిస్తాం. -హరీష్, విద్యుత్తు ఏఈ, జరుగుమల్లి

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.358

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 975 బేళ్లు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పాళ్లపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,176 బేళ్లను తీసుకురాగా, అందులో 201 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠం రూ.169, సరాసరి ధర రూ.257.66 పలికిందన్నారు.

● టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో 902 బేళ్లు కొనుగోలు జరిగాయి. దావగూడూరు, చింతలపాలెం, తూర్పు నాయుడుపాలెం, కొణతాలపాలెం గ్రామాలకు చెందిన రైతులు 424 బేళ్లను తీసుకురాగా.. 122 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠం రూ.190 పలికిందని వేలంకేంద్ర నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

దంత వైద్యం.. ఇదేమి చోద్యం!

● కనిగిరి సీహెచ్‌సీలో ఆరు నెలలుగా మూతపడ్డ విభాగం
● ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సకు రోగులపై అధిక భారం

న్యూస్‌టుడే, కనిగిరి



మూతపడిన దంత వైద్య విభాగం గది

కనిగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య ఎక్కువగా ఉంటుంది. దీంతో అనేక మంది దంత సమస్యలతో తరచూ ఇబ్బందులు పడుతుంటారు. కారణం డీప్ బోర్ల నుంచి వచ్చే ఫ్లోరైడ్, ఫ్లోరైడ్‌యుక్తమైన నీరు తాగడమే. ఇలాంటి పరిస్థితుల్లో దంత సమస్యలకు చికిత్సలు చేయాలంటే సంబంధిత వైద్య నిపుణుడు తప్పనిసరిగా ఉండాలి. కనిగిరిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలుగా దంత వైద్యులు లేరు. దీంతో ఆసుపత్రిలోని ఆ విభాగాన్ని పూర్తిగా తాళం వేసి మూసివేశారు. పేదలు దంత సమస్యలతో తాళలేక, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స భారం భరించలేక నిత్యం సతమతమవుతున్నారు.

డిప్యూటేషన్ రద్దు చేసుకుంటేనే మరొకరు వచ్చేది..

కనిగిరి కమ్యూనిటీ వైద్యశాలలో రోజుకు 400కు మందికి పైగా అవుట్ పేషెంట్లు(ఓపీ) వస్తుంటారు. ఇందులో కనీసం 20 నుంచి 30 మంది వరకు దంత సమస్యలతో బాధపడుతున్నవారే. ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల పళ్లు పుచ్చిపోవడమో, దంతాలకు గార పట్టడమో, చిగుళ్లు చీము కారడమో, లేకుంటే నొప్పి రావడం వంటి సమస్యలతో తరచూ ఈ ఆసుపత్రికి వస్తుంటారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన దంత వైద్యురాలు స్రవంతిని తిరుపతికి బదిలీ చేశారు. కర్నూల్‌కు చెందిన మరో వైద్యురాలిని ఇక్కడికి బదిలీ చేశారు. రెండు, మూడు రోజులు మాత్రమే విధులకు హాజరైన ఆమె ఆ తర్వాత డిప్యూటేషన్‌పై డోన్‌కు వెళ్లారు. ఇలా ఆరు నెలలు గడిచిపోయినా ఇంత వరకు ఆమె తిరిగి రాలేదు. ఆసుపత్రిలో పూర్తిగా దంత వైద్యులు లేకపోవడంతో ఆ విభాగం ఉన్న గది తలుపులు కూడా తీయడం లేదు. చేసేదేమీ లేక దంత సమస్యలతో వచ్చిన వారు పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంత డబ్బులు వెచ్చించలేని పేదలు, ఇతరుల అనారోగ్యంతోనే బాధపడుతున్నారు. సీహెచ్‌సీలో దంత వైద్యుడు ఉంటే తమకు ఈ బాధలు తప్పేవని పలువురు అంటున్నారు. ఈ విషయమై కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ అబ్దుల్‌కలాంను వివరణ కోరగా.. కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన వైద్యాధికారిణి మళ్లీ అదే జిల్లా డోన్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారని, ఆమె వచ్చి డిప్యూటేషన్ రద్దు చేసుకుని వెళ్తేనే మరొకరిని ఇక్కడ నియమిస్తారని తెలిపారు. దంత వైద్యులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయమై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పామూరు, న్యూస్‌టుడే: మండలంలోని బొట్లగూడూరు, నుచ్చుపొద, ఇనిమెర్ల, తూర్పు కోడిగుడ్లపాడు, పోతవరం, జంగాలపల్లి, తిరగలదిన్నె గ్రామాలకు బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు పామూరు విద్యుత్తు శాఖ డీఈఈ తోట శ్రీకాంత్ తెలిపారు. మైదుకూరు-సింగరాయకొండ(167బి) జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

అయ్యప్పరాజుపాలెంలో మంత్రి పర్యటన

మర్రిపూడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం మండలంలోని అయ్యప్పరాజుపాలెంలో నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి హాజరు కానున్నట్లు తెలిపారు.

వంద రోజుల్లోనే జనం మెచ్చారు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే జనం మెచ్చిన సంక్షేమ పాలన అందించిందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొండారెడ్డిపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృపావరం, గోస్‌ఉన్నీసాబేగంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనలో పాల్గొని వంటకాలు రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, తహసీల్దార్ దిలీప్‌కుమార్, మండల తెదేపా అధ్యక్షుడు సానిక్ష్ము తిరుపతిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, రఘునాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● పామూరు: కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తోందని తెదేపా రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అయిన మల్లి ప్రభాకర్ చౌదరి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు.



కొండారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, పాల్గొన్న నాయకులు

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా అవగాహన

కొండపి గ్రామీణం: ప్రభుత్వ పథకాలపై ఇంటింటా అవగాహన కల్పించాలని జిల్లా హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 'ఇది మంచి ప్రభుత్వం' మన ఇల్లు- మన గౌరవం' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస యోజనలో అర్హులైన ప్రతి ఒక్కరూ 2025 మార్చి లోపు ఇల్లు నిర్మించుకోవాలన్నారు. 2025 ఏప్రిల్ నుంచి పీఎంఏవై-2.0 అమలులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సత్యనారాయణ, తహసీల్దారు మురళి, ఎంపీడీవో రమణమూర్తి, హౌసింగ్ ఏఈ భూపతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సందడిగా ముగిసిన ఆటల పోటీలు

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని దిరిశవంచ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారంతో ముగిశాయి. రెండో రోజు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్‌త్రో, పరుగు పందెం, షాట్‌పుట్ తదితర విభాగాల్లో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలకు హాజరైన ఎంఈవో ఉడుముల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మండల స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు త్వరలో కనిగిరి పట్టణంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బోథో జిల్లా సంఘం కార్యదర్శి బి.విశ్వనాథరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● సి.ఎస్.పురం: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పెదరాజుపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సురేష్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ ఓబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దిరిశవంచ పాఠశాల మైదానంలో షాట్‌పుట్ వేస్తున్న బాలిక

మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియామకంపై హర్షాతిరేకాలు

టంగుటూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యనారాయణను మంగళవారం కొండపి నియోజకవర్గానికి చెందిన పలువురు తెదేపా నాయకులు అభినందనలు తెలిపారు. ఒంగోలులోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున తరలివెళ్లి పూలమాలలు, సాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. పొన్నలూరు మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్య, సీనియర్ నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, బొజ్జ శ్రీను, మక్కెన వెంకటరావు, ఏలూరి రాంబాబు, అంజిబాబు, టంగుటూరు మండల తెదేపా అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, బెల్లం జయంత్ బాబు, చదలవాడ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దామచర్ల సత్యకు అభినందనలు తెలుపుతున్న మంత్రి స్వామి, తెదేపా నేతలు



సత్యకు పూలమాలలు వేసి సత్కరిస్తున్న ఈదర ప్రభాకర్, రామా గోపి తదితరులు

నూకసానికి అభినందనలు..: తాళ్లూరు: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు నూకసాని బాలాజీని మంగళవారం పలువురు తెదేపా నాయకులు కలిశారు. ఒంగోలు పార్లమెంట్ తెదేపా కార్యదర్శి వి.సుబ్బయ్య, దర్శి నియోజకవర్గ తెదేపా మైనార్టీసెల్ అధ్యక్షుడు మీరామొద్దీన్, తూర్పుగంగవరం తెదేపా అధ్యక్షుడు కె.రామలక్ష్మయ్య, పలువురు నాయకులు ఒంగోలులోని ఆయన కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

వాన జల్లులు.. పొంగిన వాగులు

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వాడుముఖం పట్టిన పంటలు జీవం పోసుకున్నాయి. మిరప, వరి నాటేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మినుము విత్తేందుకు ఇప్పటికే పొలాలు దున్నారు. పాలేటిపల్లి, పడమటపల్లి, తలకొండపాడు గ్రామాల వద్ద వాగుల్లో వర్షపు నీరు ప్రవహించింది. పాలేటిపల్లి, పడమటపల్లి వద్ద వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. తలకొండపాడు నుంచి పాలేటిపల్లి వెళ్లే రహదారిలో వంతెన లేక పోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కొటుకుపోయింది. 67.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.



పాలేటిపల్లి వెళ్లే రహదారిలో పొంగిపొర్లుతున్న వాగు

పగటి పూట దళారులు.. చీకటి వేళ చోరులు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: పగలు బర్రెలను కొనుగోలు చేసే దళారులుగా గ్రామాల్లో తిరుగుతూ రాత్రి వేళల్లో వాటిని అపహరించే ముఠాను కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామానికి చెందిన గ్రామస్థులు సోమవారం అర్ధరాత్రి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల్లోని పాడి రైతులు పెద్ద సంఖ్యలో మంగళవారం కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కొరిశపాడు, జె.పంగులూరు, అద్దంకి మండలాలతో పాటు మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి మండలాల్లోని రైతులు తరలివచ్చారు. అనంతరం మేదరమెట్ల బస్టాండ్ సెంటర్‌లో కొద్దిసేపు బైఠాయించి, దొంగలను కఠినంగా శిక్షించడంతో పాటు తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై సురేష్ పశువులను పోగొట్టుకున్న రైతులందరికీ న్యాయం చేస్తానని, దొంగలకు శిక్ష పడేటట్లు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మేకల కాపరిని ఆదుకోవాలని వినతి

మర్రిపూడి, న్యూస్‌టుడే: పిడుగుపడి 12 మేకలు మృతి చెంది ఆర్థికంగా నష్టపోయిన మేకల కాపరి వాడేపల్లి మీరావలిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్‌తో కలిసి మంగళవారం సన్నమూరు గ్రామానికి వెళ్లి మీరావలితో మాట్లాడారు. ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు.

నలుగురు జూదరుల అరెస్టు

పీసీపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని లింగన్నపాలెం గ్రామ శివారు ప్రాంతంలో జూదం ఆడుతున్న నలుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. వారివద్ద నుంచి రూ. 48,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దర్శిలో కోతుల పట్టివేత

దర్శి, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలో శునకాలు, కోతులు వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. ఈ సమస్యపై మంగళవారం 'శునకం... వానరం.. యథేచ్ఛగా సంచారం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ మహేష్ ఆదేశాలతో కోతులను పట్టుకునే చర్యలు చేపట్టారు. గుంపులుగా తిరుగుతున్న వానరాలను పట్టుకుని బోనులో బంధించారు. వీటిని నల్లమల అడవిలో వదిలివేయనున్నట్లు అధికారులు తెలిపారు. కుక్కలను కూడా పట్టుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈనాడు కథనాలకు స్పందన

పెట్రోల్ బంకు తనిఖీ

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రం కొండపిలోని పెట్రోల్ బంకుల్లో నిబంధనలు పాటించకపోవడంపై ఈ నెల 23న 'పెట్రోల్ బంకులు.. నిబంధనలకు తూట్లు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దారు మురళి స్పందించారు. మంగళవారం కొండపి-టంగుటూరు రోడ్డులోని బంకును తనిఖీ చేశారు. ఇంధన నాణ్యతను పరిశీలించారు. కల్తీకి పాల్పడితే నోటీసులు జారీ చేస్తానని బంకు యజమానులకు స్పష్టం చేశారు.

కరపత్రాల తొలగింపు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: అధికారం మారినా గ్రామాల్లో అధికారుల తీరు మారడం లేదని పెరిదేపి గ్రామ సచివాలయంలో గత ప్రభుత్వ కరపత్రాలు, వైకాపా గుర్తులు కలిగిన జెండాలు, ఇతర సామగ్రి ఉండడంపై మంగళవారం 'ఈనాడు'లో 'నిర్లక్ష్యం.. మెట్ల కింద పదిలం' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సచివాలయ సిబ్బంది వాటిని తొలగించారు.

వ్యవసాయాధికారుల పొలంబాట

● సాగులో మెలకువలపై అన్నదాతలకు సూచనలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల్లో మంగళవంర 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పంట పొలాలను పరిశీలించి సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కనిగిరి మండలం యడవల్లి, బడుగులేరులో ఏడీఏ ఇ.వెంకటరమణ కంది, వరి ఇతర పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారి పి.జ్యోత్స్నదేవి, ఉద్యాన శాఖాధికారిణి ఎం.అంజలీబాయి పాల్గొన్నారు. ● పీసీపల్లి: పీసీపల్లి, చినవరిమడుగు గ్రామాల్లో కందిపంటకు ఆశించిన చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఏడీఏ ఇ.వి.రమణ వివరించారు. ఏవో ఎస్‌కే. షారుఖ్, మండల తెదేపా అధ్యక్షుడు వేమూరి రామయ్య, ఏఈవో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. ● టంగుటూరు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి, ఏవో స్వర్ణలత, మత్స్య శాఖ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తాళ్లూరు: రజానగరం, మల్కాపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, సిబ్బంది కలిసి పంటలను పరిశీలించారు.

● కురిచేడు: విచక్షణా రహితంగా రసాయనాలను పిచికారీ చేయొద్దని ఏవో మధుబాబు వివరించారు. పడమర వీరాయపాలెం, ఎం.గంగవరం గ్రామాల్లోని పొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు అందించారు. పొలాల్లో భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. ● పామూరు, సి.ఎస్.పురం: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవోలు కె.రాధ, టి.శిల్ప సూచించారు. పామూరు మండలంలోని దూబగుంట, నుచ్చుపొద, సి.ఎస్.పురం మండలంలోని రేగులచెలక, చెన్నపునాయునిపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. డీజీపేట పశువైద్యాధికారి షేక్ మునీర్, ఉద్యాన అధికారిణి కె.కుసుమ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ● మర్రిపూడి: సాగులో ఉన్న కందిపైరులో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సీహెచ్.వెంకటేష్ రైతులకు సూచించారు. మర్రిపూడి, రేగలగడ్డ గ్రామాల్లో కందిపైరును పరిశీలించారు. ఉద్యాన శాఖ విస్తరణాధికారిణి ధనలక్ష్మి పాల్గొన్నారు. ● సింగరాయకొండ గ్రామీణం: ఆధునిక పద్ధతులను అనుసరించి రైతులు పండ్ల తోటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని దర్శి ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డా.ఎం.రవీంద్రకుమార్ సూచించారు. మండలంలోని కనుమళ్ల, కలికవాయ గ్రామాల్లో పర్యటించారు. పండ్ల తోటలకు నీరు, ఎరువులు యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, తేజ, ఏవో సుధాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.



పీసీపల్లి: కంది పంటలో సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఏడీఏ వెంకట రమణ

ప్లాస్టిక్ నిషేధంపై లఘు నాటిక

దర్శి, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ మండలంలో కట్టశింగనపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం లఘు నాటిక ప్రదర్శించారు. ఏం చేయాలో కాదు... ఏం చేయకూడదో తెలుసుకోండి.. అంటూ ప్లాస్టిక్ భూతం వేషధారణలో ఉన్న ఒక విద్యార్థితో ఇతర విద్యార్థులు ప్రవర్తించే విధానాన్ని నాటిక రూపంలో వివరించారు. ఉపాధ్యాయుడు వేణు ఆధ్వర్యంలో హెచ్‌ఎం సుధాకరరావు పర్యవేక్షణలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమావతి, సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. ప్రయాణికులకు ఇక్కట్లు

న్యూస్‌టుడే, దర్శి

దర్శి నగర పంచాయతీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు రోడ్ల విస్తరణ జరగలేదు. మరోవైపు రహదారి పక్కన ఆక్రమణలు పెరిగిపోవడం వంటి కారణాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీటికితోడు పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పశువుల సంచారం పట్టణ వాసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యం రద్దీగా ఉండే గడియారస్తంభం కూడలి, అద్దంకి రోడ్డులో గల రామాలయ సమీప ప్రాంతం, కురిచేడు రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద, లంకోజనపల్లి రోడ్డులో రద్దీగా ఉండే బ్యాంకుల వద్ద పశువుల సంచారం అధికంగా కనిపిస్తుంది. కొన్ని చోట్ల ఇవి నడిరోడ్డుపైనే నిద్రించడంతో వాహన దారులకు సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు వాటిలో అవి పోట్లాడుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రి పూట దర్శి నుంచి హైదరాబాద్‌కు అధికంగా బస్సు సర్వీసులు ఉన్నాయి. స్థానిక గడియారస్తంభం కూడలిలో ప్రయాణికులను ఎక్కించుకోవడం కోసం బస్సులు నిలుపుతారు. ఈ సమయంలో అధికంగా పశువులు సంచారం ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



గడియార స్తంభం కూడలి సమీప రోడ్డుపై వస్తున్న పశువులు

పట్టించుకునేవారేరీ..

అల్పాహార శాలలు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను కూడలిలోని చెత్త కుండీల్లో వేయడం, వాటి వద్ద పశువులు చేరడంతో వ్యర్థాలు రోడ్డుపై పడి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పలు సందర్భాల్లో సమీప వ్యాపార సముదాయాల్లోకి పశువులు వెళ్లడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య గురించి అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పట్టణ వీధుల్లో సంచరించే పశువులను మండలంలోని వెంకటాచలంపల్లి సమీపంలోని గోశాలకు తరలిస్తామని అధికారులు చెప్పినా, అది వాస్తవరూపం దాల్చడం లేదు. దీంతో పాటు ఆయా పశువుల యజమానులను హెచ్చరించడం ద్వారా అదుపు చేస్తామని చెప్పిన మాటలు కూడా అమలు కాలేదు. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పశువుల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌ను వివరణ కోరగా.. పెంపకందారులను పిలిపించి, రోడ్లపైకి పశువులను విడిచిపెట్టకుండా చూడాలని హెచ్చరిస్తామన్నారు. మిగిలిన పశువులను గోశాలకు తరలిస్తామని తెలిపారు.

వైద్యశాలకు రూ.2 లక్షల విరాళం

కనిగిరి, న్యూస్‌టుడే: వైద్య సేవల మెరుగుకు తెదేపా నాయకుడు ముందుకొచ్చారు. ఈ మేరకు కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి రూ.2 లక్షల విరాళాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి వైద్యశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించడం అభినందనీయమన్నారు. మంచి కార్యక్రమాలకు చేయూతనివ్వడం ఎంతో అవసరమన్నారు. అనంతరం వైద్యశాల వార్డులను సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత, వైద్యశాల మరమ్మతుల గురించి సూపరింటెండ్ంట్ డా.అబ్దుల్ కలాంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఆర్డీవో పి.జాన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు చెక్కు అందజేస్తున్న తెదేపా నాయకుడు వెంకటసుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

అక్రమ వెంచర్లు స్వాధీనం చేసుకుంటాం: కలెక్టర్

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి ప్రాంతంలో విచ్చల విడిగా అనుమతులు లేకుండానే వెంచర్లు వేసి, కట్టడాలు నిర్మించారని, ఇలాంటి వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకుంటామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరు, మాచవరం, జాతీయ రహదారికి ఇరువైపులా వేసిన అక్రమ వెంచర్లను, కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కనిగిరిలో గతంలో 60 ఎకరాల అక్రమ లేఅవుట్లను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భూములుగా మార్చినట్లు తెలిపారు. ఇలాంటి చోట్ల వసతి గృహాలు, కళాశాలలు, స్థానిక అవసరాలకు తగ్గట్టుగా నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో పి.జాన్‌ఇర్విన్‌ను కోరారు. ఆమె వెంట ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో దూర విద్య

దర్శి, న్యూస్‌టుడే: బడికి దూరంగా ఉన్న, మధ్యలో మానేసిన వారికోసం దూర విద్యా విధానంలో చదువుకోవటానికి సార్వత్రిక విద్యాపీఠం కృషి చేస్తుందని విద్యాపీఠం రాష్ట్ర కోఆర్డినేటర్ నరసింహారావు అన్నారు. దర్శిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కోఆర్డినేటర్ల సమావేశం జరిగింది. దూర విద్య గోడప్రతులను ఆవిష్కరించారు. దూర విద్య ప్రాధాన్యతను ఆయన వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరీక్షల విభాగం సహాయ కమిషనర్ శివకుమార్, ఎంఈవో రఘురామయ్య, స్థానిక కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగదు

దర్శి: సచివాలయ, ఆరోగ్య కార్యకర్తల పనులు రెండూ నిర్వహించలేక మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నామని.. ఆరోగ్య కార్యకర్తల విధులు మాత్రమే నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఏఎన్‌ఎంలు విన్నవించారు. రాష్ట్రవ్యాప్త సచివాలయ ఏఎన్‌ఎంల విధుల బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చేతన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ కింద ఉద్యోగంలో చేరి ఆచరణలో ఇటు సచివాలయం పనులు, మరో వైపు ఆరోగ్య కార్యకర్త పనులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో రమణ, శివపార్వతి, రాజ్యం, లావణ్య, నాగమణి పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. వలేటివారిపాలెంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2014-19 మధ్య తెదేపా హయాంలోనే సామాజిక భవనం, సీసీ రోడ్లు, శుద్ధ జలకేంద్రం నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. వలేటివారిపాలెం - ఒంగోలు లింక్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. వంద రోజుల పాలన కరపత్రాలను పంపిణీ చేశారు. ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, పరిశీలకుడు వినుకొండ సుబ్రహ్మణ్యం, నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, పోలవరపు వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతి లేకుండా వేసిన లేఅవుట్, అనధికారిక విద్యుత్తు కనెక్షన్ల విషయాన్ని కొందరు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.



కరపత్రాలు అందజేస్తున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

త్వరలోనే ఉచిత సిలిండర్లు: చీమకుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే సంక్షేమ పాలన అంటే ఏంటో చేతల్లో చూపించిందని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. చీమకుర్తి మండలం బూసరపల్లిలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' వేడుకలో మాట్లాడారు. గ్రామంలో పనులకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభం కానున్నాయని చెప్పారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో రామచంద్ర, మన్నం ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టిపాటి రామారావు, ప్రవాస భారతీయుడు రమేష్, పుట్ట బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, లోకేష్, పి.సింగారెడ్డి, జి.రాజ తదితరులు పాల్గొన్నారు. ● చీమకుర్తి ఒకటో వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పోతురాజు, తెదేపా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, అవినిగడ్డ శేషారావు, ముప్పూరి చలమయ్య, యడ్లపల్లి సురేష్, రామిసగారి లో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

1,053 బేళ్ల కొనుగోలు

ఒంగోలు అర్బన్, న్యూస్‌టుడే: ఒంగోలు ఒకటో వేలం కేంద్రంలో మంగళవారం... గురవారెడ్డిపాలెం నుంచి 1,222 బేళ్లను వేలంలో నిలపగా వ్యాపారులు 1,053 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠం రూ.170 పలికింది. సూపరింటెండెంట్ రవికాంత్ పర్యవేక్షించారు.

28న గృహ లబ్ధిదారులతో సమావేశం

సంతనూతలపాడు: మండలంలోని గృహ లబ్ధిదారులతో ఈ నెల 28న సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఉషారాణి తెలిపారు. మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పేదల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వం రూ.4 లక్షల మేర సాయం అందజేస్తుందన్నారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో రామచంద్ర, గృహనిర్మాణశాఖ ఏఈ వెంకటస్వామి, ఏపీవో వాసంతి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

హోరా హోరీ!



కబడ్డీలో పోటీపడుతున్న బాలికలు



చదరంగంలో తలపడుతున్న బాలికలు



అండర్-17 వాలీబాల్...

పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం... ఒంగోలు నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-14, 17 విభాగాల్లో... కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం తదితర అంశాల్లో బాలబాలికలు పోటాపోటీగా తలపడ్డారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. - ఈనాడు, ఒంగోలు

నగరంపై కుక్కల దాడి!

- ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న సంతతి
- కౌన్సిల్‌లో చర్చించినా కానరాని కట్టడి చర్యలు



మంగమూరు రోడ్డు శివాజీనగర్ కాలనీ రహదారిపై తిష్ఠ వేసిన శునకాల గుంపు

- నాలుగు రోజుల క్రితం... మంగమ్మ కళాశాల సమీపంలో దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. వెనుకగా వచ్చిన ఓ వీధికుక్క దాడి చేయడంతో ముందుకు తూలిపడి గాయపడ్డారు.
- కొప్పోలులో ఇంటి ముందర ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారిపై... ఒక్కసారిగా కుక్క దాడి చేసి గాయపరిచింది. చుట్టుపక్కల వారు వెంటనే అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కొద్ది రోజుల కిందట ఈ ఘటన చోటుచేసుకుంది.
- ఇటీవల... ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న వ్యక్తి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా పేర్నమిట్ట సమీపంలో కుక్క వెంటపడడంతో అదుపుతప్పి పడిపోయారు.

న్యూస్‌టుడే - ఒంగోలు అంజయ్య రోడ్డు

నగరంలో వీధి కుక్కల సమస్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ఏ మార్గంలో చూసినా గుంపులుగా తిష్ఠ వేసి... అటుగా వెళ్లేవారిని భయపెడుతున్నాయి. చీకటిపడ్డాక మరింత ప్రతాపం చూపుతున్నాయి. వాహనదారుల వెంటపడి తరుముతుండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అర్ధరాత్రి వేళ బిగ్గరగా అరుస్తూ, కాట్లాడుకుంటూ... సమీప నివాసాల వారికి నిద్రలేకుండా చేస్తున్నాయి. ఈ విషయమై నగర వాసుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా... గత అయిదేళ్లుగా వీటి నియంత్రణకు కార్పొరేషన్ వారు నిర్దిష్ట చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ప్రతిపాదనలతో సరి...

దాదాపు ఏడాదిన్నర క్రితం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో... నగరంలో శ్రుతిమించిన కుక్కల సమస్యను పార్టీలకు అతీతంగా సభ్యులు ప్రస్తావించారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన నాటి కమిషనర్, పాలక పెద్దలు... వాటి సంతతి పెరగకుండా కు.ని. శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. ఎక్కడైనా శునకాల బెడద ఉంటే చెప్పాలని టోల్‌ఫ్రీ నంబరు సైతం ఏర్పాటు చేశారు. అప్పట్లోనే నగరవాసుల నుంచి మూడు వందలకు పైగా ఫోన్లు వచ్చాయి. ఇంత చేసినా తరువాత కార్యాచరణ కొరవడింది.

ఈ ప్రాంతాల్లో తీవ్రం...

నగరంలో ప్రత్యేకంగా జంతువధశాల అందుబాటులో లేదు. దీంతో ఎక్కడికక్కడ రహదారులపైనే జీవాలను కోసి... మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. వ్యర్థాలను పరిసరాల్లోనే పడేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలనూ ఇలానే పారబోస్తున్నారు. ఇటువంటి చోట్ల కుక్కలు తిష్ఠ వేస్తున్నాయి. వాటిలో అవి కాట్లాడుకుంటూ అటుగా వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి డివిజన్‌లోనూ ఈ సమస్య ఉంది. సాయంత్రం వేళ... ట్యూషన్ల నుంచి ఇంటికి వచ్చే పిల్లలు, కార్యాలయాల నుంచి వచ్చే ఉద్యోగులు వీటి బారిన పడుతున్నారు. రాత్రి వేళ బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనాల వెంటపడి తరుముతుండడంతో... అదుపుతప్పి గాయపడుతున్న సందర్భాలు నిత్యం చోటుచేసుకుంటున్నాయి.

త్వరలోనే కు.ని. శస్త్రచికిత్సలు...

సమస్యను నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి సి.మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా... వీధి కుక్కల సంతతి పెరగకుండా కు.ని. శస్త్రచికిత్సలు చేయించే బాధ్యతను హరియాణాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి అప్పగించినట్లు తెలిపారు. వారు కుక్కలకు శస్త్రచికిత్స చేయడంతో పాటు... ఆ తరువాత అయిదు రోజులు పర్యవేక్షణలో ఉంచుతారు. ఇందుకోసం కొత్తమామిడిపాలెంలోని వర్మీ కంపోస్టు యూనిట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూర్తిగా కోలుకున్నాక వాటిని ఏ ప్రాంతం నుంచి తెచ్చారో అక్కడే విడిచిపెడతారు. ఇందుకోసం ఒక్కో శునకానికి రూ. 1500 చొప్పున కార్పొరేషన్ చెల్లిస్తుంది. మిగతా కుక్కలకూ ప్రత్యేకంగా వ్యాక్సిన్ వేస్తారు. దీనివల్ల అవి కరిచినా అపాయం ఉండదు.



శస్త్రచికిత్సల అనంతరం కుక్కలను ఉంచేందుకు కొత్తమామిడిపాలెం వర్మీ కంపోస్టు యూనిట్‌లో చేసిన ఏర్పాట్లు

5,546 కార్పొరేషన్ అధికారుల లెక్కల ప్రకారం నగరంలోని శునకాల సంఖ్య. వాస్తవానికి ఇంతకు రెట్టింపు ఉంటాయన్నది అంచనా.

20 ఒంగోలు రిమ్స్‌కు సగటున రోజుకు వస్తున్న కుక్కకాటు బాధితుల సంఖ్య.



వంటకాల తయారీని వివరిస్తున్న సిబ్బంది

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం

మద్దిపాడు, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూపర్‌వైజర్ జి.పద్మలత పేర్కొన్నారు. మద్దిపాడు అంగన్‌వాడీ కేంద్రం-2లో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తక్కువ ఖర్చుతోనే పోషకాహారం తయారు చేసుకోవచ్చని తెలిపారు. మునగాకుతో పకోడీ, చిరు ధాన్యాలతో పలు వంటకాలు చేసి చూపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, కోమలి, మల్లీశ్వరి, కోటేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

కాలువల శుభ్రత తప్పనిసరి

ఒంగోలు నగరం: వర్షాల నేపథ్యంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా నిత్యం శుభ్రత పనులు చేపట్టాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పదో డివిజన్‌లోని గుర్రం జాషువా కాలనీలో మంగళవారం పర్యటించారు. కాలువల్లో చెత్త పోరుకుపోవడం గమనించి సిబ్బందికి సూచనలు చేశారు. సచివాలయ కార్యదర్శులు వారి పరిధిలోని కాలువలను రోజూ పరిశీలించాలన్నారు. ఏఈ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆభరణాల చోరీపై ఫిర్యాదు

ఒంగోలు నేరవిభాగం: ఆభరణాల చోరీపై రెండో పట్టణ స్టేషన్‌లో ఆలస్యంగా కేసు నమోదైంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఇస్లాంపేటకు చెందిన షేక్ నజీర్ అహ్మద్ ఇంటిలో 15 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఈ విషయమై బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన వెనుక కుటుంబ వివాదాలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

కలెక్టర్‌ను కలిసిన దామచర్ల

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పలు సమస్యలపై చర్చించేందుకు కలెక్టర్ తమీమ్ అన్సారియాను... ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మంగళవారం కలిశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, రెవెన్యూ ఉద్యోగుల బదిలీలతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. తెదేపా నాయకులు నూకసాని బాలాజీ, కామేపల్లి శ్రీనివాసరావు, వినుకొండ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సర్వే

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి పేర్కొన్నారు. బీఎల్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొత్త ఓట్లు, బదిలీలు, మరణాలు తదితర అంశాలను క్షుణ్నంగా పరిశీలించాలన్నారు. కార్యాలయం సీనియర్, జూనియర్ సహాయకులు శ్రీనివాసరావు, ఉపేంద్ర, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాల తనిఖీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలోని ఎస్‌కేఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలను దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు అర్చన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి... అక్కడి వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిణి డి.సుభద్ర, మైనారిటీ సంక్షేమాధికారి బి.నారాయణ, ఎంఈవో కె.శివాజీ, డైట్ కళాశాల ప్రధానాచార్యుడు సుబ్బారావు, పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాపర్ల స్టేషన్‌లో శుభ్రత పనులు

నాగులుప్పలపాడు: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో రాపర్ల రైల్వే స్టేషన్‌లో మంగళవారం శుభ్రత పనులు చేపట్టారు. అక్టోబరు రెండో తేదీ వరకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రోగ్రాం అధికారి హరికృష్ణ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందుతున్న నలభై మంది మహిళలు... స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. శిక్షకురాలు సుజాత, సమన్వయకర్త శివకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు మరింత ప్రయోజనం కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎన్

మద్దిపాడు, న్యూస్‌టుడే: పొగాకు రైతులకు మరింత లబ్ధి చేకూరేలా బోర్డు అధికారులు, కొనుగోలుదారులు చర్యలు తీసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. వెల్లంపల్లి కేంద్రంలో అమ్మకాల ప్రక్రియను ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రైతు బీమా చేయించుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ సూచించారు. పార్టీ నాయకులు అడకా స్వాములు, జయంత్‌బాబు, రావి మహేశ్వరావు, కుమారస్వామి, శేషగిరిరావు, సర్పంచి అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు భవాని, నారిపెద్ది వరహాల చౌదరి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. గుండ్లకమ్మ కుడి, ఎడమ కాలువలు బాగు చేయకుండా నీరు విడుదల చేయడం వల్ల తలెత్తుతున్న సమస్యలను ఆయకట్టు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఇరిగేషన్ మంత్రి రామానాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. జంగిల్ క్లియరెన్స్ చేపడతామని ఆయన తెలిపారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సలహాలు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చుని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మద్దిరాలపాడులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేద్యం ఆధునిక పద్ధతుల ఆవశ్యకతను వివరించారు. విత్తన శుద్ధి వల్ల కలిగే ప్రయోజనం, రాయితీ పథకాలు తదితరాలపై ఆత్మ డీడీ సుబ్రహ్మణ్యం, ఏడీఏ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. హెచ్‌వో ప్రత్యూష, ఏవో వెంకట్రావు, సర్పంచ్ అనూరాధ, పశువైద్యురాలు అనూరాధ, క్షేత్రాధికారి ప్రేమ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

● **ఒంగోలు గ్రామీణం:** వెంగముక్కపాలెం, గుండాయపాలెం; **సంతనూతలపాడు:** కామేపల్లివారిపాలెం; **చీమకుర్తి:** బూదవాడ, పులికొండ; **మద్దిపాడు:** రాచవారిపాలెం, కీర్తిపాడు; **కొత్తపట్నం:** అల్లూరు, చింతల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. మేయర్ గంగాడ సుజాత, ఆయా మండలాల వ్యవసాయాధికారులు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

డీఎస్వోగా పద్మశ్రీ నియామకం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణిగా ఎస్.పద్మశ్రీ నియమితులయ్యారు. పల్నాడు జిల్లా నుంచి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుత డీఎస్వో ఎ.ఉదయభాస్కర్‌ను కోనసీమకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ వీరపాండ్యన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏవో బాధ్యతల స్వీకరణ... : ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ కార్యాలయం పరిపాలనాధికారిగా బి.రాజేంద్ర ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డీఎల్‌పీవో కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఆ స్థానంలో ఉన్న ఏవో శివప్రసాద్ కందుకూరు డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

కార్పొరేషన్‌కు కొత్త డీఈలు, ఏఈలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం డీఈ రఘురామ్‌ను నెల్లూరు కార్పొరేషన్‌కు, మరో డీఈ గణపతిని కందుకూరుకు బదిలీ చేస్తూ ఈఎన్‌సీ కార్యాలయం ఉత్తర్వులు ఇచ్చింది. వారి స్థానంలో నెల్లూరు నుంచి పీవీ అనిల్‌కుమార్, పి.ఏసయ్యను నియమించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న చంద్రయ్య ఎంఈగా, జి.అర్చన ఏఈగా ఇక్కడకు వస్తున్నారు. ఒంగోలు ఏఈ ప్రసాదరావును బాపట్లకు బదిలీ చేశారు.

29న గిరిజన ఉద్యోగుల సంఘం ఉత్సవాలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సంబరాలు... ఈ నెల 29న ఉదయం పది గంటలకు ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బాలాజీనాయక్ తెలిపారు. ముఖ్య అతిథిగా మహిళా, శిశు; గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి హాజరవుతున్నట్లు చెప్పారు. గిరిజన ఉద్యోగులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఓ ప్రకటనలో కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే:

సమస్య: నగరంలోని సుజాతనగర్ 1, 2, 3 లైన్లలో వీధులు శుభ్రం చేయడం లేదు. చెత్త సేకరణా సరిగా లేదు. కాలువల నుంచి తీసిన వ్యర్థాలను సైతం రోడ్లపైనే వదిలేశారు.
– లత, స్థానిక మహిళ

సమాధానం: బుధవారమే ఆ వ్యర్థాలను తరలించే ఏర్పాటు చేస్తాం. రోజువారీ చెత్త సేకరణ పక్కాగా సాగేలా చర్యలు తీసుకుంటాం. – బాజ్జీ, పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు

తీరంలో వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు నిర్లక్ష్యం చేయడంతో... కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం సముద్ర తీరంలో కనీస వసతులు కొరవడి సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై... ఈ నెల 12న 'అటకెక్కిన పర్యాటకం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తీరంలో వ్యర్థాలు తొలగించి... శుభ్రత పనులు చేపట్టారు. వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చౌదరి మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సీపీఐ సీనియన్ నాయకుడు పీవీఆర్ చౌదరి మృతి కార్మిక ఉద్యమానికి తీరనిలోటని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఒంగోలు నగర ముఠా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. పేదలు, కార్మికుల సమస్యలపై నిరంతర పోరు సాగించారని గుర్తుచేసుకున్నారు. వివిధ సంఘాల నాయకులు వెంకట సుబ్బయ్య, అంజిబాబు, కరవది సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, కె.అంజయ్య, వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు కళాకారుల తోడ్పాటు



వేడుక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన తప్పెటగుళ్లు, మిమిక్రీ షో, జముకుల కథ, చిన్నారుల భరతనాట్యం, నాటక ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సూర్యశ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ, కళాకారులు జబర్దస్త్ అప్పారావు, అసిరయ్య తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



యాగంలో పాల్గొన్న భక్తులు - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వేడుకగా వారాహి యాగం

ఒంగోలు అంజయ్య రోడ్డు, న్యూస్‌టుడే: వారాహి అమ్మవారి ఉపాసకులు మహారుద్ర స్వామి ఆధ్వర్యంలో తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు చేపట్టిన శ్రీ వారాహి మహా రథయాత్ర మంగళవారం ఒంగోలు నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా కర్నూలు రోడ్డులోని వంతెన వద్ద ఉన్న సిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి సంతపేటలోని తితిదే కల్యాణమండపం వరకు రథాయాత్ర సాగింది. పురవీధుల్లో భక్తులు ఘన స్వాగతం పలికారు. రాత్రి... వారాహి యాగం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్న ప్రసాద వితరణ చేపట్టారు. దాసరి నరసింహారావు, కొక్కిరాల సంజీవరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, సాయితేజారెడ్డి, నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



జనారణ్యంలోకి జింక

ఓ జింక దారి తప్పి కొత్తపట్నం పొలాల్లోకి వచ్చింది. గ్రామానికి చెందిన రైతు సాయి, మరికొందరు స్థానికులు మంగళవారం దానిని గుర్తించి పట్టుకున్నారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. – న్యూస్‌టుడే, కొత్తపట్నం

వరద బాధితులకు పోటెత్తిన విరాళాలు



రూ.6 లక్షల చెక్కును తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబుకు అందిస్తున్న పుల్లలచెరువు పార్టీ నాయకులు, కార్యకర్తలు




రూ.3.12 లక్షల నగదు అందిస్తున్న వై.పాలెం తెదేపా నాయకులు

పుల్లలచెరువు, న్యూస్‌టుడే: వరద బాధితులకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తెదేపా నాయకులు పెద్దఎత్తున సేకరించి అందజేస్తున్నారు. ఇసుక త్రిపురవరంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పుల్లలచెరువు తెదేపా నాయకులు సేకరించిన రూ.6 లక్షలను పార్టీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబుకు అందజేశారు.

యర్రగొండపాలెం పట్టణం: యర్రగొండపాలెం మండల తెదేపా ముఖ్య నాయకులు, అన్ని గ్రామాల క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జులు కలిసి సేకరించిన రూ.3.12 లక్షలను తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు. పార్టీ నాయకులు చేకూరి సుబ్బారావు, మాజీ సర్పంచి సత్యనారాయణగౌడ్, వెంకట కోటయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: చోడవరం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు గుంటుపల్లి మదన్మోహన్‌రావు రూ.1లక్ష, కొమ్మలపాటి రాఘవరావు రూ.50 వేలు, రావిపాటి నారాయణ రూ.10 వేలు మొత్తం రూ.1.60 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు చెక్కును మంగళవారం ఒంగోలులోని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికైన దామచర్ల సత్యకు అందజేశారు.



తెదేపా నేత దామచర్ల సత్యకు చెక్కు అందజేస్తున్న చోడవరం తెదేపా నాయకులు



చెక్కును ఎమ్మెల్యే నారాయణరెడ్డికి అందజేస్తున్న సాధన విద్యాసంస్థల సిబ్బంది

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: వరదలతో తీవ్రంగా నష్టపోయిన విజయవాడవాసులకు పట్టణానికి చెందిన సాధన విద్యాసంస్థలు అండగా నిలిచాయి. ఈ మేరకు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మంగళవారం అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్లు, సిబ్బంది ఒకరోజు వేతనంతో పాటు విద్యార్థులందించిన ఈ ఆర్థిక సాయాన్ని విద్యాసంస్థల డైరెక్టర్లు జీవీఎల్.రమేష్ బాబు, ప్రిన్సిపల్ కె.మధుసూదన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.కృష్ణారెడ్డి తదితరులు అందజేశారు.



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు చెక్కు అందజేస్తున్న కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత చెక్కును మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు.

22 మంది ఎంపీడీవోలకు బదిలీ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 22 మంది ఎంపీడీవోలను బదిలీ చేశారు. నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన అయిదుగురికి పోస్టింగులు కేటాయించారు. ఈ మేరకు జిల్లా ప్రజాపరిషత్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంపీడీవోల బదిలీల వివరాలిలా ఉన్నాయి.

పేరు	పోస్టింగ్ ఇచ్చిన మండలం
పి. సుజాత	పొన్నలూరు
పి. శ్రీకృష్ణ	కొత్తపట్నం
కె. స్వరూపరాణి	జె. పంగులూరు
కె. రాజశేఖర్‌రావు	ఒంగోలు
ఎ. శ్రీనివాసమూర్తి	చినగంజాం
ఎన్. జగదీష్	మద్దిపూడి
బి. రామాంజనేయులు	కొండపి
వై. శ్రీనివాసరావు	మార్టూరు
కె. నేతాజీ	కారంచేడు
పి. రత్నజ్యోతి	కందుకూరు
డి. నరసయ్య	అర్ధవీడు
ఆర్. దేవసేనకుమారి	టంగుటూరు
డి. జయమణి	సింగరాయకొండ
ఆర్. ఎల్. రాజ్యలక్ష్మి	కొరిశపాడు
వీవీఎం. రమణమూర్తి	జరుగుమల్లి
కె. కుసుమకుమారి	బల్లికురవ
డి. సురేష్‌బాబు	సంతనూతలపాడు
వి. జ్యోతి	మద్దిపాడు
జి. శ్రీనివాసరావు	ఇంకొల్లు
ఎం. రాజేష్‌బాబు	వేటపాలెం
బి. సింగయ్య	అద్దంకి
ఎం. రంగ సుబ్బరాయుడు	హనుమంతునిపాడు

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణకు నిత్యం పాటుపడే పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల కోసం మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాతతో కలిసి ప్రారంభించారు. ఆస్టర్ రమేష్ ఆసుపత్రి సీఈవో డాక్టర్ నితిన్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, కార్పొరేటర్లు, వివిధ విభాగాల వైద్య నిపుణులు పాల్గొన్నారు. ◆ నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి త్వరలో నిధులు సేకరించనున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో మాట్లాడి ఎంపీ ల్యాడ్స్ నిధులు కేటాయించేలా మాట్లాడతామన్నారు. శిబిరం అనంతరం కార్పొరేటర్లతో సమావేశమై... చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత

జీజీహెచ్‌లో పొగాకు ఉత్పత్తుల విరమణ కేంద్రం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రజారోగ్యాన్ని కాపాడటం కోసం సర్వజన ఆసుపత్రిలో పొగాకు విరమణ కేంద్రాన్ని ప్రారంభించారు. మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దురాదేవి కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. పొగాకు వాడకం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్‌లో భాగంగా ఎన్ఎంసీ ఆదేశాల మేరకు వారిచ్చే మార్గదర్శకాల ప్రకారం పనిచేస్తుందన్నారు. పొగాకు విరమణ అనేది అత్యంత కష్టం అయినప్పటికీ వివిధ పద్ధతుల ద్వారా వ్యసనాన్ని తగ్గించవచ్చన్నారు. సైకియాట్రీ విభాగంలో అనుభవం కలిగిన సిబ్బంది దీనిలో అందుబాటులో ఉంటారని, అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, ఆర్.సాగర్, శ్రీ విద్య పూజిత పాల్గొన్నారు.



పొగాకు ఉత్పత్తుల విరమణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దురాదేవి

విద్యుత్తు శాఖ ఈఈ, డీఈలకు స్థాన చలనం

ఒంగోలు గ్రామీణం: జిల్లాలో విద్యుత్తు శాఖకు చెందిన పలువురు ఈఈలు, డీఈలు బదిలీ అయ్యారు. మరో 23 మంది డీఈఈలు బదిలీలు జరిగాయి. ఈ మేరకు సీఎండీ సంజీవి మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ ప్రాంతం
కె. వెంకటేశ్వర్లు	డీపీఈ, ఒంగోలు	టెక్నికల్, ఒంగోలు
టి. హైమావతి	టెక్నికల్, ఒంగోలు	డీపీఈ, ఒంగోలు
ఎం. హరిబాబు	కనిగిరి	ఆపరేషన్, ఒంగోలు
ఏ. వీరయ్య	కందుకూరు	కనిగిరి
ఎం. నాగేశ్వరరావు	ఎంఅండ్‌పీ-1, ఒంగోలు	కందుకూరు
పి. శ్రీనివాసులు	ఈఈ, ఒంగోలు	దర్శి

ఎక్సైజ్ శాఖ డీసీగా హేమంత్ నాగరాజు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా కె.హేమంత్ నాగరాజు నియమితులయ్యారు. ఆయన నెల్లూరులో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) డీసీగా పనిచేశారు. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా పోస్టింగుల్లో ఆయన జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. పల్నాడు జిల్లా సెబ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న షేక్ ఖాజా మొహియుద్దీన్‌ను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. గతంలో సెబ్‌లో పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర కేంద్రంలో వెయిటింగ్‌లో ఉన్న కె.విజయను జిల్లా ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రన్న మాట.. చదువుకు బాసట

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వారం గడవక ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ అమలులోకి వచ్చింది. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మద్దిరాలపాడులోని ఓ గృహ సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా తమ పిల్లలను చదివించే స్తోమత లేదని సాయం చేయాలంటూ నిరుపేదలైన ఖాజావలి, బీబీసార సీఎంను కోరారు. స్పందించిన చంద్రబాబు మీ పిల్లల చదువు బాధ్యత తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అక్కడే వేదికపై ఉన్న హర్షిణి కళాశాల అధినేతకు పిల్లల బాధ్యత అప్పగించారు. దానిలో భాగంగా మంగళవారం కుమార్తె పఠాన్ రజియాకు ఇంటర్మీడియట్‌లో, కుమారుడిని మార్టూరులోని శ్రీహర్షిణి స్కూల్లో పదో తరగతి ప్రవేశాలు కల్పించారు. వారిని అధైర్య పడవద్దని పిల్లల చదువు బాధ్యత తీసుకుంటామని కళాశాల అధినేత గోరంట్ల రవికుమార్ భరోసా ఇచ్చారు. ఇద్దరికీ ఆయా వసతి గృహాల్లో ఉచిత వసతి కూడా అందిస్తామన్నారు. పేద దంపతులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



పఠాన్ రజియాకు ప్రవేశ పత్రం అందిస్తున్న గోరంట్ల రవికుమార్

100 రోజులు.. రూ.140 కోట్ల పనులు

పొన్నలూరు, న్యూస్‌టుడే: తెదేపా కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో జిల్లాకు రూ.140 కోట్లతో పనులు చేపట్టినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మండలంలోని చౌటపాలెంలో మంగళవారం రాత్రి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండపి నియోజకవర్గంలోనే రూ.20 కోట్లు పనులు చేశామన్నారు. నవరత్నాల పేరుతో జగన్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని మండి పడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు ప్రారంభం, రోడ్ల నిర్మాణం మొదలు పెట్టామన్నారు. దీపావళి నుంచి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. అనంతరం ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చౌటపాలెంలో సభలో పాల్గొన్న మంత్రి స్వామి, తెదేపా నాయకులు, అధికారులు

చురుగ్గా సాగర్ కాలువ పూడికతీత

▶ చేయూతనందించిన గ్రానైట్ సంస్థ



అగ్రహారం మేజర్‌లో పూడిక తొలగింపు పనులు

న్యూస్‌టుడే, చీమకుర్తి : సాగర్ కాలువల్లో కీలకమైన అగ్రహారం మేజర్‌లో చిల్లచెట్లు, పూడికతీత పనులు గత మూడు రోజులుగా చురుగ్గా జరుగుతున్నాయి. గత వైకాపా హయాంలో నిర్వహణ పనులను విస్మరించారు. ఈ నేపథ్యంలో చీమకుర్తి పరిధిలోని అగ్రహారం మేజర్‌లో పూడికతీతకు తోడ్పాటు అందజేయాలని స్థానిక రైతులు నీటి పంపిణీ సంఘం మాజీ అధ్యక్షుడు కాట్రగడ్డ రమణయ్య గ్రానైట్ యాజమాన్యానికి విన్నవించగా, వారు యంత్రాలు సమకూర్చి ఈ నెల 21 నుంచి పూడికతీత, చిల్లచెట్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. సుమారు 2.5 కిలోమీటర్ల పరిధిలో పనులు దాదాపుగా పూర్తయ్యాయి. జంగిల్ క్లియరెన్స్ చేసిన ప్రాంతంలో కాలువ కొత్త రూపు సంతరించుకుంది. మేజర్ పొడవునా పూడిక తీయాలంటే సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని..ఆమేరకు కృష్ణసాయి గ్రానైట్ సంస్థల యజమానులు శిద్దా వెంకటేశ్వర రావు, హనుమంతరావు యంత్రాలు సమకూర్చి పనులు చేయిస్తున్నారని రైతులు కె.రమణయ్య, ఉన్నం హనుమంతరావు, ఈ.నారాయణ, పి.సుబ్బారావు తదితరులు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఇతర గ్రానైట్ సంస్థల వారు యంత్రాలు సమకూరిస్తే సాగర్ కాలువలు కొత్త రూపు సంతరించుకుంటాయని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ జైలుశిక్ష

ఒంగోలు న్యాయవిభాగం , న్యూస్‌టుడే: వ్యాపారి మువ్వల వెంకటసుబ్బారావు అలియాస్ సుబ్బు హత్య కేసులో నిందితుడు గుంటూరు జిల్లా నగరికల్లు మండలం బాలాజీనగర్ తండాకు చెందిన రమావత్ ఏసునాయక్‌కు ఒంగోలు ఒకటో అదనపు జిల్లా కోర్టు ఇన్‌ఛార్జి, ఫ్యామిలీ, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా యావజ్జీవ జైలుశిక్ష విధించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.హెచ్. జ్యోస్ఫిన్ తెలిపిన వివరాల ప్రకారం...అద్దంకికి చెందిన సుబ్బారావు భార్యతో వేరుపడి ఒంగోలులోని బాలాజీరావుపేటలో ఉంటున్నారు. ఆయన మంగమూరు రోడ్డులో సుబ్బు సెల్ షాపు పేరుతో దుకాణం ప్రారంభించారు. నిందితుడు ఏసునాయక్ తన స్వగ్రామం నుంచి ఒంగోలు వచ్చి ఇక్కడే నివసిస్తున్నాడు. అతను మహిళలను ఈయన దగ్గరకు తీసుకొస్తూ బాగా దగ్గరయ్యాడు. 2016 డిసెంబర్ 3న నిందితుడు ఒంగోలులోని సుబ్బారావు సెల్‌ఫోన్ దుకాణానికి వచ్చాడు. ఈ సందర్భంగా ఆదాయం ఎక్కువగా వస్తున్న విషయాన్ని గమనించి..అదేరోజు రాత్రి అమ్మాయి వద్దకు తీసుకెళతానని చెప్పి జామాయిల్ తోటలోకి తీసుకెళ్లి హత్యచేశాడు. అనంతరం షాపు తాళాలు తెరిచి నగదు, సొత్తు తీసుకుని పరారయ్యాడు. దీనిపై అప్పటి ఒంగోలు రూరల్ సీఐ మురళీకృష్ణ దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విచారించిన జడ్జి నిందితునిపై నేరం రుజువైనందున యావజ్జీవ జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు. కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.



ఫాతిమాను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి మద్దిశెట్టి శ్రీధర్

లాక్రోస్ పోటీలకు ఎంపిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు సమీపంలోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థిని షేక్ ఫాతిమా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆగ్రాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు జీవీకే.మూర్తి తెలిపారు. ఆమె ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి శ్రీధర్ అభినందించి రూ.10 వేలు బహూకరించారు. కార్యక్రమంలో డీన్ సీవీ.సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో బృంద స్ఫూర్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవా భావం, బృందస్ఫూర్తి అలవడతాయని ఏకేయూ ఉప కులపతి డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవంలో మాట్లాడారు. వర్సిటీ పరిధిలో 58 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని... వాటి ద్వారా పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపు దిశగా మరిన్ని పనులు చేపట్టాలని రిజిస్ట్రార్ హరిబాబు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హర్షప్రీతమ్‌దేవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర, ఆర్.శ్రీనివాస్, పిల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ మూర్తి

● ట్రిపుల్ ఐటీలో... : సంతనూతలపాడు, ఒంగోలు నగరం : ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వేడుకలో కళాశాల డైరెక్టర్ భాస్కర్ పటేల్, నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌సా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దృఢమైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. సామాజిక కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాలన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన వాలంటీర్లకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.సౌమ్య, పీవో ఎం.శ్రీనివాసరెడ్డి, రంగస్వామి, సురేష్‌బాబు, పావని, పి.వి.భాస్కర్, పి.లావణ్య, మాధవీలత, మోహన్‌రావు, చంద్రశేఖర్, డీన్ రూపస్‌కుమార్ పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రోగ్రాం అధికారిణి సౌమ్య

నాలుగు గ్రానైట్ వాహనాల సీజ్

మద్దిపాడు, న్యూస్‌టుడే: అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న నాలుగు లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ రాఘవరావు మంగళవారం సిబ్బందితో మండలంలో పలు రహదారులలో నిఘా వేశారు. వెల్లంపల్లి - తాళ్లూరు రహదారిలో అక్రమంగా గ్రానైట్ ముడిరాయిని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మంగళవారం గురవారెడ్డిపాలెం కొష్టాలు మార్గంమధ్యలో గ్రానైట్ స్లాబులతో వెళుతున్న రెండు లారీలను ఆపి తనిఖీ చేయగా ఎటువంటి పత్రాలు చూపించలేదు. దీంతో అక్రమంగా తరలిస్తున్న ఆ వాహనాలను మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన గ్రానైట్ లారీలు

విధి వంచితపై మృగాడి అఘాయిత్యం

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విధి వంచితురాలపై ఓ మృగాడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సభ్య సమాజం తలదించుకునే ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదిలి ఎస్సై వేమన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ మతిస్థిమితం కోల్పోయింది. గత గురువారం ఆమె పొలం నుంచి ఇంటికొస్తుండగా బట్టువారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల రహేలయ్య నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. కుంగిపోయిన బాధితురాలు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపగా, ఆమెకు స్థానికంగా ప్రథమ చికిత్సలు చేసి, పరీక్షల నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు పొదిలి పోలీసులకు సమాచారమివ్వగా, సంఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వేమన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 555 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.91/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244